PRGI NO : TGTEL/26/A2002
EDITOR: PEMBI MAHENDHAR

# నవగీతం

NAVAGEETAM DINAPATHRIKA
తెలుగు దినపత్రిక

హైదరాబాద్ | సంపుటి : 1 | సంచిక : 59 | పేజీలు : 8 | శనివారం 25 జూలై 2026 | వెల : 4/-






## లద్దాఖ్, కశ్మీర్‌లో చైనా అక్రమ ప్రాజెక్టులపై భారత్ సీరియస్

- పాక్ సింధు జలాల ఒప్పందంపైనా కీలక ప్రకటన
- జమ్ముకశ్మీర్, లద్దాఖ్‌లో చైనా ఆక్రమణలపై భారత్ ఆగ్రహం
- సరిహద్దుల్లో శాంతితోనే ద్వైపాక్షిక సంబంధాలు బలపడుతాయని ప్రకటన
- సింధు జలాల ఒప్పందం అమలుపైనా కీలక వ్యాఖ్యలు



## లీక్‌లకు చెక్ పెట్టే బిల్లుకు
# కేంద్ర కేబినెట్ ఆమోదం

- జైలు శిక్షలు, జరిమానాలు మరింత పెంపు!
- కేంద్ర క్యాబినెట్ సమావేశంలో పేపర్ లీక్‌లపై చర్చ
- 2024 ప్రవేశ పరీక్షల అక్రమ పద్ధతుల నివారణ చట్టంలో కీలక సవరణలకు సిద్ధం
- దోషులకు కఠిన జైలు శిక్షలు, భారీ జరిమానాలు విధించే అవకాశాలు

## రోడ్డు భద్రతకు
# ప్రత్యేక బ్యూరో

- ట్రాఫిక్ నిర్వహణ, రోడ్డు భద్రత పర్యవేక్షించేలా సంస్థాగత నిర్మాణం
- రెండు లేదా మూడు నెలలకోసారి ట్రాఫిక్ క్రమబద్ధీకరణపై సమీక్ష
- స్మార్ట్ సిగ్నలింగ్ విధానంపై సమగ్రంగా అధ్యయనం
- డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపేందుకు కఠిన నిబంధనలు తీసుకురావాలి
- అధికారులతో సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి



హైదరాబాద్

రాష్ట్రంలో ట్రాఫిక్ నిర్వహణ, రోడ్డు భద్రత పర్యవేక్షణ కోసం ప్రత్యేకంగా ఒక బ్యూరోను ఏర్పాటు చేయాలని అధికారులను ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. రవాణా వ్యవస్థను సమగ్రంగా అధ్యయనం చేసి ట్రాఫిక్ నిర్వహణ, రోడ్డు భద్రత పర్యవేక్షణ కోసం ఏర్పాటు చేసే ఈ బ్యూరోకు సంస్థాగత నిర్మాణం ఉండాలని సూచించారు. ఎంసీఆర్ హెచ్ఆర్‌డీలోని బోధి పెవిలియన్‌లో ఈ అంశంపై ఆయన ఉన్నతాధికారులతో సమీక్షించారు. రాష్ట్రంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణతో పాటు మాదక ద్రవ్యాల నిరోధం, భద్రత కమిటీల ఏర్పాటుపై ఈ సందర్భంగా అధికారులకు - మిగతా3లో



## ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు కేంద్రం నో?

- స్పష్టం చేసిన ప్రభుత్వ వర్గాలు!
- ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు సుముఖంగా లేని కేంద్రం
- నీట్ లీక్ వివాదంలో ప్రధాన్ రాజీనామాకు పట్టుబడుతున్న సీజేపీ
- నష్టపరిహారం, కేసుల ఉపసంహారణకు ప్రభుత్వం సూత్రప్రాయ అంగీకారం




## యువత పోరాటాన్ని మలినం చేయొద్దు

- దిల్లీలో జరిగిన పరిణామాలు చూస్తే ఎవరూ చలించకుండా ఉండరు
- ఇందిరాపార్కు వద్ద బీఆర్ఎస్ నిరసన కార్యక్రమం
- దిల్లీ ఘటనలకు వ్యతిరేకంగా విద్యార్థులకు సంఘీభావంగా నిరసన
- విద్యార్థులకు సంఘీభావం తెలిపిన కేటీఆర్
- పీఎం మోదీకి భయపడి సీఎం రేవంత్ కొట్లాడటం లేదు

హైదరాబాద్

మోదీపై పోరాడుతుంటే ఇక్కడ చోటా భాయ్‌కు ఎందుకు కోపమని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ప్రశ్నించారు. దిల్లీలో పార్టీలకు అతీతంగా నిరసనలు కొనసాగుతున్నాయని అన్నారు. దేశవ్యాప్తంగా విద్యార్థులు, యువత కదం తొక్కుతున్నారని వివరించారు. దిల్లీ జంతర్? మంతర్ వద్ద యువత గళం విప్పుతున్నారని అన్న ఆయన, విద్యార్థుల పోరాటానికి అండగా ఉండేందుకే నిరసన కార్యక్రమం చేపట్టామన్నారు. దిల్లీలో విద్యార్థులు, యువతపై లాఠీఛార్జ్‌కు నిరసనగా వారి - మిగతా3లో

## తెలంగాణపై
# ఎల్‌నినో పడగ



- 11,151 గ్రామాల్లో వర్షాల మాటే లేదు!
- 23 జిల్లాల్లో ఇంకా వర్షాభావమే
- 53 రోజుల వానాకాల సీజన్‌లో వర్షాలు కురిసింది 27 రోజులే
- ప్రభుత్వానికి వ్యవసాయ శాఖ నివేదిక

హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రంలో 12,760 రెవెన్యూ గ్రామాలు ఉండగా, కేవలం 1,609 గ్రామాల్లో మాత్రమే వ్యవసాయ పనులు కొనసాగుతున్నాయి. ఏకంగా 11,151 గ్రామాల్లో తీవ్ర నైరాశ్యం నెలకొంది. ఎల్?నినో ప్రభావంతో ఈ గ్రామాల్లో వర్షాల మాటే లేదు. రాష్ట్రంలో ఇప్పటి వరకు 2,320 గ్రామాల్లో ఒక మోస్తరు, 7959 గ్రామాల్లో తీవ్రంగా, 892 గ్రామాల్లో అత్యంత తీవ్ర లోటు ఉంది. మొత్తంగా చూస్తే ప్రస్తుత వానాకాలం సీజన్?లో గురువారం వరకు 23 జిల్లాల్లో ఇంకా వర్షాభావమే ఉంది. మిగిలిన పది జిల్లాల్లోనూ సాధారణ వర్షపాతమే - మిగతా3లో



## విద్యార్థులను హెచ్చరించే ధైర్యమా?

- యూనివర్సిటీలపై రాహుల్ ఫైర్
- విద్యార్థులను హెచ్చరించడానికి విశ్వవిద్యాలయాలకు ఎంత ధైర్యమని రాహుల్ ప్రశ్న
- ఇది ప్రజాస్వామ్య హక్కులను అణిచివేసే ప్రయత్నమని వెల్లడి

## దూరంగా నిర్మిస్తే
# నిరుపయోగమే!




- హైదరాబాద్‌లో ఇందిరమ్మ ఇళ్లను నివాస ప్రాంతాల్లోనే నిర్మించాలి
- క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష
- ఓఆర్ఆర్ లోపల నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ స్థలాలు గుర్తించాలి
- పోలీస్, రెవెన్యూ, రవాణా శాఖల స్థలాలను తీసుకోవాలని ఉన్నతాధికారులకు ఆదేశం

హైదరాబాద్

క్యూర్(కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ) పరిధిలోని నివాస ప్రాంతాల్లోనే ఇందిరమ్మ ఇళ్లను నిర్మించాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఇందుకోసం ఓఆర్ఆర్ లోపల నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ స్థలాలు గుర్తించాలని చెప్పారు. పోలీస్, రెవెన్యూ, రవాణా శాఖల స్థలాలను తీసుకుని ఆ శాఖలకు వేరే చోట భూ కేటాయింపులు చేయాలన్నారు. హైదరాబాద్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్లపై సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇప్పటికే పలు నియోజకవర్గాల్లో వివిధ శాఖలకు సంబంధించిన స్థలాలు గుర్తించినట్లు అధికారులు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. జనావాసాలకు దూరంగా ఇందిరమ్మ ఇళ్లను కేటాయిస్తే - మిగతా3లో

## జంతర్ మంతర్‌లో అంటువ్యాధుల ముప్పు

- జులై 20 నిరసనకారులను గుర్తించే వేటలో పోలీసులు
- రంగంలోకి అదనపు బలగాలు
- హింసాకాండ ముందస్తు ప్రణాళికతో జరిగిందా, ఆకస్మికంగా చెలరేగిందా అని నిర్ధారించడానికి పోలీసు ప్రయత్నాలు
- అనుమానితుల కదలికలను గుర్తించేందుకు సన్నాహాలు
- రంగంలోకి అదనపు బలగాలు



నవగీతం
తెలుగు దినపత్రిక
శనివారం
25 జూలై 2026

# లద్దాఖ్, కశ్మీర్‌లో చైనా అక్రమ ప్రాజెక్టులపై భారత్ సీరియస్

జమ్ముకశ్మీర్, లద్దాఖ్‌లో చైనా చేపడుతున్న ప్రాజెక్టులపై భారత్ మరోసారి తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ ప్రాంతాలు భారత భూభాగంలో ఉన్నాయని, అక్కడ చైనా ఏకపక్షంగా మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల్ని నిర్మించడం భారత సార్వభౌమాధికారాన్ని ఉల్లంఘించడమేనని విదేశాంగ మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ శుక్రవారం మీడియా సమావేశంలో పలు కీలక అంశాలపై స్పందించారు. ఇటీవల మనీలాలో జరిగిన ఆసియాన్ సదస్సు సందర్భంగా భారత విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్, చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ మధ్య ద్వైపాక్షిక సమావేశం జరిగింది. ఈ భేటీకి సంబంధించి చైనా విడుదల చేసిన ప్రకటన వివాదాస్పదమైంది. తైవాన్, టిబెట్ అంశాల్లో చైనా సార్వభౌమాధికారాన్ని గౌరవిస్తామని జైశంకర్ హామీ ఇచ్చారని ప్రకటనలో పేర్కొంది. దీనిపైనే ఇప్పుడు భారత్ తీవ్రంగా స్పందించింది. జైశంకర్ అలాంటి వ్యాఖ్యలు చేయలేదని, చైనా చేసిన వాదనలు అసత్యాలేనని ఖండించారు.

'సార్వభౌమాధికారానికి సంబంధించిన విషయాల్లో ప్రశ్నలు లేవనెత్తాల్సింది భారత్. ఇంకా భారత్ ఎప్పుడూ చైనా సార్వభౌమాధికారాన్ని ఉల్లంఘించలేదు. కానీ 1963 నుంచి జమ్ముకశ్మీర్, లద్ధాఖ్‌లోని భారత భూభాగాల్ని చైనా అక్రమంగా ఆక్రమించి ఉంది. భారత భూభాగాల్లో ప్రాజెక్టుల్ని నిర్మిస్తోంది.' అని జైస్వాల్ అన్నారు. జమ్ముకశ్మీర్‌కు చెందిన భూభాగంలో చైనా చేపడుతున్న ప్రాజెక్టుల్ని కూడా భారత్ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని ఆయన స్పష్టం చేశారు.

భారత్ ప్రధానంగా పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ గుండా వెళు తున్న చైనా పాకిస్థాన్ ఎకనామిక్ కారిడార్‌తో పాటు షక్స్‌గామ్ లోయలో చైనా కార్యకలాపాలపైనా ఎప్పటినుంచో



అభ్యంతరం వ్యక్తం చేస్తోంది. ఇక మనీలా సమావేశంలో జైశంకర్, భారత్- చైనా సంబంధాలు సాధారణ స్థితికి రావాలంటే సరిహద్దు ప్రాంతాల్లో శాంతి, ప్రశాంతత తప్పనిసరి అని స్పష్టం చేశారు.

### సింధు జలాల ఒప్పందం- మరోసారి పాకిస్థాన్‌కు తేల్చిచెప్పిన భారత్

ఇక పాకిస్థాన్ ఉగ్రవాదానికి శాశ్వతంగా, అందరికీ నమ్మకం కలిగేలా స్వస్తి చెప్పే వరకు సింధు జలాల ఒప్పందం అమల్లోకి రాదని కేంద్ర విదేశాంగ శాఖ మరోసారి స్పష్టం చేసింది. సింధు జలాల ఒప్పందంపై భారత్ వైఖరి అదే విధంగా స్పష్టంగా ఉందని రణధీర్ జైస్వాల్ తెలిపారు. 'పాకిస్థాన్ సరిహద్దు బయట జరిగే ఉగ్రవాదానికి తిరుగులేని, విశ్వసనీయ ముగింపు పలికే వరకు సింధు జలాల ఒప్పందం అమల్లోకి రాదు.' అని స్పష్టం చేశారు. ఆసియాన్ సమావేశంలో పాకిస్థాన్ ఉప ప్రధాని, విదేశాంగ మంత్రి ఇషాక్ దార్ కశ్మీర్ అంశంతో పాటు ×బె విషయాన్ని ప్రస్తావించిన నేపథ్యంలో భారత్ ఈ వివరణ ఇచ్చింది. ఆసియాన్ వేదికను పాకిస్థాన్ రాజకీయ ఆరోపణలకు ఉపయోగించుకుంటోందని జైస్వాల్ విమర్శించారు.

### చీనాబ్ వరదలపై పాక్ ఆరోపణలు నిరాధారం

ఇదే సమయంలో చీనాబ్ నదిలో వరదల్ని భారత్ కావాలనే సృష్టించిందన్న పాకిస్థాన్ మీడియా కథనాల్ని కూడా విదేశాంగ శాఖ ఖండించింది. జులై 20 నుంచి 23 మధ్య జమ్మూ పరిసర ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాల కారణంగానే చీనాబ్ నదిలో నీటి ప్రవాహం పెరిగిందని జైస్వాల్ వివరించారు. పాకిస్థాన్ అధికారిక వరద అంచనా నివేదికల్లో కూడా ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాల వల్లే చీనాబ్ నదిలో నీటి ప్రవాహం పెరిగిందని పేర్కొన్నట్లు వీజూూ తెలిపింది. అందువల్ల ఈ వరదల్ని భారత్‌తో ముడిపెట్టడం వాస్తవాలకు విరుద్ధమని తేల్చిచెప్పింది.

భారత్ ముందస్తు వరద హెచ్చరికలు ఇవ్వలేదన్న ఆరోపణల్ని కూడా కేంద్రం కొట్టిపారేసింది. ఆ సమయంలో నదీ ప్రవాహం ప్రత్యేక హెచ్చరికలు జారీ చేయాల్సిన స్థాయికి చేరలేదని తెలిపింది. గతేడాది మాదిరిగానే అవసరం ఏర్పడితే మానవతా దృక్పథంతో దౌత్య మార్గాల ద్వారా వరదలకు సంబంధించిన సమాచారాన్ని పాకిస్థాన్‌తో పంచుకుంటామని జైస్వాల్ వెల్లడించారు.

### రాష్ట్రపతి రొమేనియా పర్యటనపై

జులై 23- 25 తేదీల్లో భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రొమేనియా పర్యటనపై కూడా ఇదే మీడియా సమావేశంలో విదేశాంగ మంత్రిత్వ శాఖ స్పందించింది. భారత్- యూరోపియన్ యూనియన్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం అమల్లోకి రావడం భారత్- రొమేనియా వాణిజ్య సంబంధాల్ని మరింత బలోపేతం చేస్తుందని పేర్కొంది. ట్రేడ్, టెక్నాలజీ, టూరిజం అలాగే టాలెంట్.. వీటికి సంబంధించి రెండు దేశాల మధ్య సహకారం మరింత విస్తరించే అవకాశాలు ఉన్నాయని తెలిపింది.

# లీక్‌లకు చెక్ పెట్టే బిల్లుకు కేంద్ర కేబినెట్ ఆమోదం

ప్రవేశ పరీక్షల ప్రశ్నపత్రాల లీకేజీ ఘటనలు దేశవ్యాప్తంగా తీవ్ర ఆందోళనకు కారణమవుతున్న వేళ వాటిని అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలకు సిద్ధమవుతోంది. ప్రధాని నరేంద్రమోదీ అధ్యక్షతన శుక్రవారం జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశంలో పేపర్ లీక్‌లను అరికట్టే దిశగా కీలక అంశాలపై చర్చించారు. ఇప్పటికే అమల్లో ఉన్న 2024 ప్రవేశ పరీక్షల (అక్రమ పద్ధతుల నివారణ) చట్టంలో సవరణలు చేసి మరింత కఠిన నిబంధనలు తీసుకురావాలని కేంద్రం భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు పేపర్ లీకేజీలపై కఠిన శిక్షలకు అవకాశమిచ్చే బిల్లుకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ప్రశ్నపత్రాల లీక్‌లకు పాల్పడే వ్యక్తులు, ముఠాలపై కఠిన చర్యలు తీసుకుంటామని ప్రధాని మోదీ ఇటీవల ప్రకటించారు. ఈ నేపథ్యంలోనే కేంద్ర ప్రభుత్వం చట్టపరమైన మార్పులపై దృష్టి సారించింది. ప్రస్తుతం అమల్లో ఉన్న నిబంధనలను మరింత బలోపేతం చేసి, నిందితులకు దీర్ఘకాల జైలు శిక్షలు, భారీ జరిమానాలు విధించేలా ముసాయిదా బిల్లును సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. ఆ అంశంపై గురువారం ప్రధాని మోదీ ప్రత్యేక వీడియో సందేశాన్ని విడుదల చేశారు. ప్రశ్నపత్రాల లీకేజీల వల్ల లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు దెబ్బతింటోందని, ఇలాంటి ఘటనలను ఏ మాత్రం సహించబోమని ఆయన స్పష్టం చేశారు. లీక్‌లకు పాల్పడిన వారిపై చట్టపరంగా కఠిన



చర్యలు తీసుకోవడమే కాకుండా, కేసుల విచారణను వేగంగా పూర్తి చేసే విధానాన్ని కూడా అమలు చేయనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం అమల్లో ఉన్న 2024 ప్రవేశ పరీక్షల (అక్రమ పద్ధతుల నివారణ) చట్టం ప్రకారం, వ్యక్తిగతంగా ప్రశ్నపత్రాల లీక్‌కు పాల్పడిన వారిపై 3 నుంచి 5 సంవత్సరాల వరకు జైలు శిక్ష, రూ.10 లక్షల వరకు జరిమానా విధించే అవకాశం ఉంది. అదే వ్యవస్థీకృతంగా జరిగే నేరాల విషయంలో 5 నుంచి 10 సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ.1 కోటి వరకు జరిమానా విధించే నిబంధనలు ఉన్నాయి. అయితే, ఇటీవల చోటుచేసుకున్న పలు ప్రవేశ పరీక్షల లీక్ ఘటనల నేపథ్యంలో ఈ శిక్షలు సరిపోవడం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. దీంతో జైలు శిక్షల కాలాన్ని పెంచడం, జరిమానాల మొత్తాన్ని భారీగా పెంచడం వంటి అంశాలను కేంద్రం పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా పరీక్షల నిర్వహణలో భాగమైన అధికారులు లేదా వ్యవస్థీకృత నేర ముఠాలు ప్రమేయం ఉన్న కేసుల్లో మరింత కఠిన నిబంధనలు అమలు చేసే అవకాశం ఉన్నట్లు సమాచారం.

ఇక, పేపర్ లీక్ కేసుల విచారణను వేగవంతం చేయడంపై కూడా కేంద్రం ప్రత్యేక దృష్టి పెట్టింది. ఇందుకోసం ప్రత్యేక ఫాస్ట్‌ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఇప్పటికే దిల్లీలో తొలి ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఏర్పాటు కాగా, త్వరలో మరో నాలుగు కోర్టులను కూడా ఏర్పాటు చేసే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని సమాచారం. ఈ కోర్టుల్లో పేపర్ లీక్‌లకు సంబంధించిన కేసులను ఏడాది లోపే విచారించి తీర్పులు ఇవ్వాలనే లక్ష్యంతో చట్టంలో సవరణలు చేయనున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఇలాంటి కేసుల విచారణకు ఎక్కువ సమయం పడుతుండటంతో నిందితులకు శిక్షలు ఆలస్యమవుతున్నాయనే విమర్శలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో వేగవంతమైన న్యాయ ప్రక్రియకు ప్రాధాన్యం ఇవ్వాలని కేంద్రం నిర్ణయించినట్లు తెలుస్తోంది.

# 'విద్యార్థులను హెచ్చరించే ధైర్యమా?

నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై సీజేపీ ఆధ్వర్యంలో జరుగుతున్న ఆందోళనలకు దూరంగా ఉండాలని పలు విశ్వవిద్యాలయాలు విద్యార్థులను హెచ్చరించడంపై కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలో జరుగుతున్న తప్పులను ప్రశ్నించడం విద్యార్థుల ప్రజాస్వామ్య హక్కు అని పేర్కొన్న ఆయన, ఆందోళనల్లో పాల్గొనవద్దని విద్యార్థులను హెచ్చరించడానికి విశ్వవిద్యాలయాలకు ఎంత ధైర్యమని ప్రశ్నించారు. ప్రజాస్వామ్య హక్కులను అణచివేసే ప్రయత్నాలు సరికావని, ఇలాంటి చర్యలకు పాల్పడుతున్న విద్యాసంస్థలు తగిన సమయంలో ప్రజలకు జవాబుదారీగా ఉండాల్సి వస్తుందని రాహుల్ గాంధీ హెచ్చరించారు. జంతర్‌మంతర్ వద్ద జరిగే నిరసనల్లో పాల్గొంటే చట్టపరమైన చర్యలు ఎదుర్కోవాల్సి రావచ్చని పేర్కొంటూ డీయూ, జేఎన్‌యూ, ఐఐటీలు విద్యార్థులకు ముందస్తు సూచనలు చేశాయి. అలాగే నిరసనలకు సంబంధించిన పోస్టులు, వీడియోలు లేదా ప్రచార విషయాలను సోషల్ మీడియాలో పంచుకోవద్దని కూడా పేర్కొన్నాయి. విద్యార్థుల భద్రత దృష్ట్యా, సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారమే ఈ సూచనలు జారీ చేసినట్లు విద్యాసంస్థలు వెల్లడించాయి.

అలాగే పేపర్ లీక్ అంశంపై పార్లమెంట్?లో చర్చించడానికి ప్రతిపక్షం సిద్ధంగా ఉందని, అయితే ఎలాంటి చర్చలకైనా ముందు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్?ను తొలగించాలని డిమాండ్? చేస్తున్నట్లు రాహుల్? గాంధీ తెలిపారు. కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ రిజిజు ఈ విషయంపై చర్చించడానికి ఎంపీలను ఆహ్వానించారని, అయితే తాను మాట్లాడటానికి ప్రయత్నించినప్పుడు? ఆయన స్పందించలేదని రాహుల్? ఆరోపించారు. నిరసన చేస్తున్న విద్యార్థులకు మూడు ప్రధాన డిమాండ్లు ఉన్నాయని, ఆ డిమాండ్లన పరిష్కరించే వరకు ప్రతిపక్షం చప్పుల్లో పాల్గొనబోదని రాహుల్? స్పష్టం చేశారు. అందులో మొదటిది విద్యాశాఖ మంత్రిని తొలగించడం, రెండోది విద్యార్థులపై దాడి చేసి, వారిని కొట్టిన వారిపై చర్య తీసుకోవాలని, మూడోది ప్రధాని విద్యార్థులకు క్షమాపణ చెప్పాలి అని అన్నారు.

"ఇప్పుడే మన ఎంపీలతో చర్చ జరగాలని చెప్పాలనుకుంటున్నట్లు మంత్రి రిజిజు ఒక ప్రకటన చేశారు. సాధారణ నియమావళి ప్రకారం ఎవరైనా మరొకరి పేరు ప్రస్తావిస్తే, వారికి ప్రతిస్పందించాలి. నేను అలా



స్పందించాలనుకున్నపుడు నీ మైక్?ను లాగేసుకున్నారు. నాకు ఆ అవకాశం ఇవ్వలేదు."

నిరసన చేస్తున్న విద్యార్థులకు మూడు ప్రధాన డిమాండ్లు ఉన్నాయని, ఆ డిమాండ్లన పరిష్కరించే వరకు ప్రతిపక్షం చప్పుల్లో పాల్గొనబోదని రాహుల్? స్పష్టం చేశారు. అందులో మొదటిది విద్యాశాఖ మంత్రిని తొలగించడం, రెండోది విద్యార్థులపై దాడి చేసి, వారిని కొట్టిన వారిపై చర్య తీసుకోవాలని, మూడోది ప్రధాని విద్యార్థులకు క్షమాపణ చెప్పాలి అని అన్నారు.

జంతర్‌మంతర్ వద్ద ఆందోళనల్లో పాల్గొన్న నిరసనకారులపై పెల్లెట్‌గన్ ప్రయోగించారన్న ఆరోపణలను దిల్లీ పోలీసులు ఖండించారు. అయితే దిల్లీ పోలీసుల ప్రకటనను ఖండించిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ, పెల్లెట్‌గన్ ప్రయోగంలో గాయపడ్డ బాధితుడిని రుజువుగా కెమెరా ముందుకు తీసుకొచ్చారు. పెల్లెట్‌గన్ దాడిలో అతడి కంటికి తీవ్ర గాయమైందని చెప్పుకొచ్చారు. "పెల్లెట్ గన్ ఎప్పుడు తగిలిందో నేను చెప్పాలనుకుంటున్నాను. నా సోదరులు భారతదేశ త్రివర్ణ పతాకాన్ని పట్టుకుని శాంతియుతంగా నిరసన తెలుపుతున్నప్పుడు ఈ పెల్లెట్ గన్లు ప్రయోగించారు. ప్రభుత్వం ఏమో అసలు ఏ పెల్లెట్ గన్ ఉపయోగించలేదని చెప్తోంది. అవునా? ఇదిగో చూడండి, దీన్ని పెల్లెట్ గన్ అంటారు. దీన్ని, దీన్ని పెల్లెట్ గన్ అంటారు. సరేనా? ఇతని కన్ను దెబ్బతింది. కంటిచూపు సరిగ్గా కనిపించడం లేదు. వీళు మన దేశ భవిష్యత్తు! అలాంటి వేలాది మంది యువకులపై పెల్లెట్ గన్లు ఉపయోగించారు, లాఠీఛార్జ్ చేశారు, కొట్టారు, హింసించారు." అని రాహుల్ గాంధీ అన్నారు.

### కేంద్ర ప్రభుత్వంపై విరుచుకుపడ్డ ఖర్గే

అయితే విశ్వవిద్యాలయాల్లో విడుదలైన సర్క్యులర్లపై కాంగ్రెస్ నేతలు, విద్యావేత్తలు, సినీ ప్రముఖులు తీవ్ర విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే కూడా కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రభుత్వం విశ్వవిద్యాలయాలను విద్యార్థులను బెదిరించే "ప్రచార కేంద్రాలుగా" మార్చేస్తోందని ఆరోపించారు. జంతర్‌మంతర్ వద్ద జరుగుతున్న నిరసనలకు దూరంగా ఉండాలని డీయూ, జేఎన్‌యూ విద్యార్థులకు సలహాలు ఇవ్వడం దీనికి నిదర్శనమని అన్నారు.

"మోదీ ప్రభుత్వం దేశంలోని అత్యంత గౌరవనీయమైన విశ్వవిద్యాలయాలను విద్యార్థులను బెదిరించడానికి ఉపయోగిస్తోంది. విద్యార్థులు ఎందుకు వీధుల్లోకి వస్తున్నారో దీనివల్లే స్పష్టమవుతోంది. విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌తో రాజీనామా చేయించి, విద్యా వ్యవస్థలో సంస్కరణలపై చర్చ ప్రారంభించాల్సిన ప్రభుత్వం, మోదీ, షా నాయకత్వంలో విద్యా కేంద్రాలనే అవమానిస్తోంది. గత 12 ఏళ్లలో బీజేపీ విద్యా వ్యవస్థను ఎలా దెబ్బతీసిందో ఇప్పుడు దేశ ప్రజలకు అర్థమవుతోంది."

దిల్లీ విశ్వవిద్యాలయం పూర్వ విద్యార్థి, కాంగ్రెస్ ఎంపీ దీపేందర్ హుడా మాట్లాడుతూ, "డీయూ విడుదల చేసిన ఈ ప్రకటనను నేను తీవ్రంగా ఖండిస్తున్నాను. జంతర్‌మంతర్ వద్ద నిరసనలు చట్టవిరుద్ధమని ఎవరు ప్రకటించారు? ఇలాంటి విషయాల్లో తప్పుడు ప్రచారం చేయడం సిగ్గుచేటు" అని వ్యాఖ్యానించారు. నటి, నిర్మాత పూజా భట్ కూడా ఈ వ్యవహారంపై స్పందించారు. "విద్యార్థుల గొంతులను అణచివేస్తే వారి భద్రత మరింత ప్రమాదంలో పడుతుంది. వారి భవిష్యత్తుపై నిజంగా ఆందోళన ఉంటే మౌనంగా ఉండకుండా, వారి ప్రజాస్వామ్య హక్కులకు మద్దతు ఇవ్వాలి" అని ఆమె పేర్కొన్నారు.

## జంతర్ మంతర్‌లో అంటువ్యాధుల ముప్పు



దిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జులై 20న జరిగిన ఘర్షణల్లో పాల్గొన్న వారిని గుర్తించేందుకు పోలీసులు సిద్ధమయ్యారు. ఆ హింసాకాండ ముందస్తు ప్రణాళికతో జరిగిందా లేక ఆకస్మికంగా చెలరేగిందా అని నిర్ధారించడానికి దిల్లీ పోలీసులు వేలాది వీడియోలు, సోషల్ మీడియా ప్రసారాలు, మొబైల్ ఫోన్ రికార్డులను పరిశీలిస్తున్నారని శుక్రవారం వర్గాలు తెలిపాయి. పోలీసు సిబ్బందిపై దాడి చేస్తూ, ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేసిన వారిని గుర్తించడానికి మొబైల్ ఫోన్ రికార్డింగ్‌లు, సీసీటీవీ ఫుటేజ్, లైవ్‌స్ట్రీమ్‌లు, సోషల్ మీడియా కంటెంట్‌ను విశ్లేషిస్తున్నారని వర్గాలు పేర్కొన్నాయి. అలాగే, నిరసనల సమయంలో సోషల్ మీడియాలో లైవ్‌లోకి వెళ్లిన వ్యక్తులను కూడా దర్యాప్తు అధికారులు గుర్తిస్తున్నారని ఓ అధికారి తెలిపారు. ఆ ప్రసారాల ద్వారా హింసలో పాల్గొన్న వ్యక్తుల ఉనికిని కనిపెట్టవచ్చని భావిస్తున్నారు. పోలీసు బారికేడ్లను ఛేదించడానికి ప్రయత్నించే ముందు నిరసనకారులు సమన్వయం చేసుకున్నారా లేదా అని నిర్ధారించడానికి, దర్యాప్తు అధికారులు పలువురు అనుమానితుల కాల్ రికార్డ్స్, మొబైల్ టవర్ లొకేషన్లు, కమ్యూనికేషన్ విశ్లేషిస్తున్నారు. ఘర్షణలకు ముందు, తర్వాత సమయంలో అనుమానితుల కదలికలను పోలీసులు గుర్తించనున్నారు. హింసాకాండ జరిగిన సమయంలో పలు ప్రదేశాల్లో ఉన్న మొబైల్ నంబర్లను గుర్తించడానికి, పార్లమెంట్ స్ట్రీట్, జంతర్ మంతర్ దాని పరిసర ప్రాంతాల నుంచి టవర్ డంప్ విశ్లేషణ కూడా జరుగుతున్నట్లు వర్గాలు తెలిపాయి.

### స్పెషల్ క్రైమ్ బ్రాంచ్?

ఇక, జులై 20న జరిగిన ఘర్షణలపై దర్యాప్తు చేసేందుకు దిల్లీ పోలీసులు స్పెషల్ సెల్?, క్రైమ్ బ్రాంచ్‌ను ఏర్పాటు చేశారు. ఇప్పటికే ఈ నిరసనల్లో తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న 480కి పైగా పాకిస్థాన్ ఆధారిత సోషల్ మీడియా ఖాతాలను గుర్తించినట్లు నగర పోలీసులు గురువారం ప్రకటించారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో కూడా అవే ఖాతాలు యాక్టివ్?గా ఉన్నాయని తెలిపారు. విద్యార్థులను రెచ్చగొట్టే ఉద్దేశంతో వదంతులు, తప్పుడు పోస్ట్‌లు, ఎడిట్ చేసిన వీడియోలు ప్రస్తుత పరిస్థితులను దుర్వినియోగం చేస్తున్నాయని ఒక పోలీసు అధికారి పేర్కొన్నారు.

### రంగంలోకి అదనపు బలగాలు

నీట్ పేపర్ లీకేజీపై దిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద విద్యార్థుల ఆందోళనలు కొనసాగుతున్న వేళ కేంద్ర ప్రభుత్వం భద్రతా చర్యలను ముమ్మరం చేసింది. విద్యార్థుల నిరసన దృష్ట్యా భద్రతను పెంచేందుకు ఛత్తీస్‌గఢ్ నుంచి 10 సీఆర్‌పీఎఫ్ కంపెనీల బలగాలను రంగంలోకి దించనుంది. వీళ్లని దిల్లీకి రప్పించేందుకు కేంద్రం అన్ని ఏర్పాట్లు చేసిందని అధికార వర్గాలు తెలిపాయి. భద్రత పెంచేందుకు ఈ వారంలో బంగాల్ నుంచి 20 సీఆర్‌పీఎఫ్ కంపెనీల బలగాలను కేంద్రం రప్పించింది.

### స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా పటిష్ఠ బందోబస్తు

అటు సాధారణంగా స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా దిల్లీ విధుల్లో చేరే సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్సెస్ కూడా ముందుగానే దిల్లీకి చేరుకోవాలని అధికారులు ఆదేశించారు. రానున్న కొన్ని రోజుల్లో సుమారు 150 సీఏపీఎఫ్? కంపెనీలను దిల్లీలో మోహరించనున్నారు. ఇప్పటికే పోలీసులకు శాంతిభద్రతల విధుల్లో సహాయం చేసేందుకు సుమారు 100 సీఏపీఎఫ్? కంపెనీలు దిల్లీలో అందుబాటులో ఉన్నాయి. వీటితో పాటుగా మూడు ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ యూనిట్లు, ఇతర సాయుధ బలగాలను కూడా రంగంలోకి దించారు. మరోవైపు, భద్రతా కారణాల దృష్ట్యా దిల్లీ మెట్రో భద్రతా సిబ్బంది సెలవులను అధికారులు రద్దు చేశారు.

### నిరసన ప్రదేశంలో అంటువ్యాధుల ముప్పు

ఇదిలా ఉండగా, జంతర్ మంతర్ నిరసన ప్రదేశంలో అంటువ్యాధుల ముప్పు పొంచి ఉందని, చాలా మంది నిరసనకారులు తలనొప్పి, గొంతు నొప్పితో బాధపడుతున్నట్లు స్థానిక వైద్యులు తెలిపారు. తీవ్రమైన ఎండ, అధిక తేమ, భారీ జనసమూహం వల్ల చాలా మంది వైరల్ ఇన్ఫెక్షన్లు, డీహైడ్రేషన్, ఇతర ఆరోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. చాలా మంది బహిరంగ ప్రదేశాల్లో నేలపైనే నిద్రిస్తున్నారని, దీనివల్ల ఇన్ఫెక్షన్ ముప్పు పెరుగుతోందని తెలిపారు.

## ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు కేంద్రం నో?



నీట్ పేపర్ లీక్ వివాదం నేపథ్యంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలంటూ కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఆధ్వర్యంలో విద్యార్థులు ఆందోళనలు ఉద్ధృతం చేసినప్పటికీ, ఆయన రాజీనామాకు కేంద్ర ప్రభుత్వం సుముఖంగా లేదని తెలుస్తోంది. ఈ విషయంలో వెనక్కి తగ్గే ప్రసక్తి లేదని ప్రభుత్వ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. "రాజీనామా చేయడం చాలా తేలికైన నిర్ణయం. కానీ ప్రజలు మాకు అధికారం ఇచ్చింది బాధ్యతలను నిర్వర్తించడానికే తప్ప, పారిపోవడానికి కాదు. మేము వ్యవస్థను ప్రక్షాళన చేస్తాం" అని ఉన్నత స్థాయి ప్రభుత్వ వర్గాలు వెల్లడించినట్లు ఆంగ్ల మీడియాలో కథనాలు వెలువడ్డాయి. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ)లో నెలకొన్న వ్యవస్థాగత సమస్యలను పరిష్కరించడం, పేపర్ లీక్ ముఠాలపై కఠిన చర్యలు తీసుకోవడంపైనే ప్రస్తుతం ప్రభుత్వం ప్రధానంగా దృష్టి సారించిందని ఆ వర్గాలు పేర్కొన్నాయి. శుక్రవారం జంతర్ మంతర్ వద్ద ఆందోళన చేస్తున్న సీజేపీ విద్యార్థులతో కేంద్ర ప్రభుత్వం రెండో విడత చర్చలు జరిపింది. ప్రభుత్వ ప్రతినిధులుగా కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, జితేంద్ర సింగ్ ఈ చర్చల్లో పాల్గొన్నారు. ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు నష్టపరిహారం చెల్లించడం, శాంతియుత నిరసనకారులపై నమోదైన కేసులను ఉపసంహరించుకోవడం వంటి అంశాలకు సూత్రప్రాయంగా అంగీకరించిన ప్రభుత్వం, మంత్రి రాజీనామా విషయంలో మాత్రం శనివారం మధ్యాహ్నం వరకు గడువు కోరినట్లు కాక్రోచ్ జనతా పార్టీ తెలిపింది. అయితే, ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసే వరకు ఆందోళనలు విరమించే ప్రసక్తే లేదని సీజేపీ నేతలు అశుతోష్ రాంకా, అభిజీత్ దీప్కే తేల్చి చెప్పారు. ఇదిలా ఉండగా, కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి వినీత్ జోషిని బదిలీ చేసి, కీలక విభాగాల్లో కొత్త అధికారులను నియమించింది. మరోవైపు, కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఇతర విద్యా సంబంధిత అంశాలపై సోషల్ మీడియాలో చురుకుగా వ్యవహరిస్తూనే, పేపర్ లీక్‌లకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలను షేర్ చేస్తున్నారు.

నవగీతం
తెలుగు దినపత్రిక
శనివారం
25 జూలై 2026శూరం

# యువత పోరాటాన్ని మలినం చేయొద్దు

-మొదటిపేజీ తరువాయి

పోరాటానికి సంఘీభావంగా ఇందిరాపార్క్ వద్ద బీఆర్ఎస్ పార్టీ నిరసన కార్యక్రమం చేపట్టింది. బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ధర్నాలో పాల్గొని విద్యార్థులకు మద్దతుగా సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

రాజకీయ అజెండాలతో యువత పోరాటాన్ని మలినం చేయవద్దని కేటీఆర్ హితవు పలికారు. దిల్లీలో విద్యార్థులపై జరిగిన దాడులు చూస్తే బాధేస్తుందన్నారు. 'మోదీ, అమిత్‌షా కుర్చీలు అడిగారా అధికారం కోరారా? రాజీనామా చేసి ప్రభుత్వాన్ని అప్పగించాలని యువత కోరారా? అన్యాయం జరిగిన విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు' అని కేటీఆర్ పేర్కొన్నారు. విద్యార్థులకు న్యాయం జరగాలని సోనమ్ వాంగ్‌చుక్ నిరాహార దీక్ష చేపట్టారన్నారు. జవాబుదారీతనం, విద్యా విధానంలో సంస్కరణలు చేపట్టాలని కోరుతూ ఆయన నిరసన చేపట్టారని కేటీఆర్ తెలిపారు. నిరసనలను మీడియా చూపకపోయినా జెన్ జీ సోషల్ మీడియా దేశం మొత్తాన్ని కదిలించిందన్నారు.




### పీఎం మోదీకి భయపడి సీఎం రేవంత్ కొట్లాడటం లేదు

దిల్లీలో ఇంత జరుగుతుంటే సీఎం రేవంత్ రెడ్డి కొడంగల్ వెళ్లి దాక్కున్నారని కేటీఆర్ విమర్శించారు. దేశం అంతటా మోదీ, ధర్మేంద్ర ప్రధాన్‌ను ప్రశ్నిస్తుంటే రేవంత్ రెడ్డి ఇక్కడ కేసీఆర్, కేసీఆర్ అని అంటున్నారని ఎద్దేవా చేశారు. పేపర్‌లీక్‌కు తనకు సంబంధం అని మాట్లాడితే లీగల్ నోటీసులు పంపించినట్లు వివరించారు. రేవంత్ రెడ్డి తన ఆరోపణ రుజువు చేసి ఇదే ఇందిరాపార్క్ వద్ద తనను ఉరితీయవచ్చని కేటీఆర్ సవాల్ విసిరారు. మోదీకి భయపడి రేవంత్ రెడ్డి కొట్లాడటం లేదని ఎద్దేవా చేశారు.

"ఎవరితో పెట్టుకోకూడదో వారి తోనే(జెన్ జీ) మోదీ పెట్టుకున్నారు. ఆయన జాగ్రత్త పడాలి. యువత తలచుకుంటే కొద్ది రోజుల క్రితమే నేపాల్‌లో ప్రభుత్వం కుప్పకూలింది. శ్రీలంకలో దేశం విడిచి వెళ్లే వరకు ఉరికిచ్చి కొట్టారు. పిల్లలు ఉద్యమం చేస్తుంటే దేశ ద్రోహులు అని ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారు. ఉడుత ఊపులు, ఐటీ, సీబీఐ, ఈడీకి ఈ జనరేషన్ భయపడదు. పొట్టు పొట్టు ఆకలితో ఉన్న జెన్ జీ మెట్టు మెట్టు ఎక్కుతారు. తల్లిదండ్రులకు కూడా చెప్పకుండా పిల్లలు దిల్లీ వెళ్లి అద్భుత పోరాట పటిమ కనబరుస్తోంది. దిల్లీలో జరిగిన పరిణామాలు చూస్తే ఎవరూ చలించకుండా ఉండరు. సోనమ్ వాంగ్‌చుక్, విద్యార్థులు గాంధేయ మార్గంలో నిరసన తెలుపుతుంటే ఎందుకు పోలీసుల దాష్టీకం"–కేటీఆర్, బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు

### మోదీపై పోరాడుతుంటే చోటాభాయ్‌కు ఎందుకు కోపం

తమ పార్టీ అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకు మొత్తం బీఆర్ఎస్ పార్టీ విద్యార్థులకు సంఘీభావంగా వచ్చిందని, ఈ విషయంలో ఎలాంటి రాజకీయం లేదని కేటీఆర్ అన్నారు. ధర్మేంద్ర ప్రదాన్? రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులపై పెట్టిన కేసులు వెంటనే విత్?డ్రా చేయాలన్నారు. మోదీ ప్రభుత్వంపై కొట్లాడేందుకు తాము వస్తుంటే ఇక్కడ చోటాభాయ్?కు ఎందుకు కోపమని కేటీఆర్ ప్రశ్నించారు. యూత్? కాంగ్రెస్ వాళ్లు తన కారుకు అడ్డుపడ్డారన్నారు. దిల్లీలో ధర్నా చేస్తున్న పిల్లల్ని కొడుతుంటే రేవంత్ రెడ్డి ఎందుకు నోరుమెదపట్లేదని ప్రశ్నించారు.

## రోడ్డు భద్రతకు ప్రత్యేక బ్యూరో

-మొదటిపేజీ తరువాయి

పలు కీలక సూచనలు చేశారు. ప్రతి రెండు లేదా మూడు నెలలకోసారి ట్రాఫిక్ క్రమబద్ధికరణకు తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించాలని చెప్పారు. ట్రాఫిక్ వ్యవస్థలో నిబంధనలకన్నా క్రమబద్ధికరణపై ఎక్కువగా దృష్టి సారించాలని, వాతావరణంలో వచ్చే మార్పులు, కార్యాలయాల పనివేళలు, రద్దీ సమయాలు, స్థానిక సంస్కృతిని దృష్టిలో పెట్టుకుని ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. కొత్తగా మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయడానికి ముందే ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు అవసరమైన అధ్యయనం జరగాలని చెప్పారు. ఔటర్ రింగ్ రోడ్డుపై ప్రమాదాలు జరగకుండా నియంత్రణ చర్యలు పటిష్టం చేయాలని, ఓఆర్ఆర్‌పై ఇష్టానుసారం వాహనాలు నిలపకుండా నిరంతర పర్యవేక్షణ జరగాలని ఆదేశించారు. హైదరాబాద్ నగరంలో స్మార్ట్ సిగ్నలింగ్ విధానంపై సమగ్రంగా అధ్యయనం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. సిగ్నల్ ఫ్రీ వ్యవస్థను తీసుకురావడానికి అవసరమైన చోట్ల అండర్‌పాస్‌లు, ఎలివేటెడ్ కారిడార్‌లను నిర్మించాలని, సాధ్యమైనంత వరకు సిగ్నళ్ల వద్ద ట్రాఫిక్ నిలిచిపోకుండా వాహనాల రాకపోకలు నిరంతరాయంగా కొనసాగేలా చూడాలని సూచించారు.

### డ్రగ్స్‌పై విద్యా సంస్థలకు బాధ్యత అప్పగించాలి

'డ్రగ్స్ నిరోధంపై ప్రభుత్వం సీరియస్‌గా దృష్టి సారించింది. మాదకద్రవ్యాలపై ఉక్కుపాదం మోపేందుకు కఠిన నిబంధనలు తీసుకురావాలి. విద్యా సంస్థల్లో డ్రగ్స్ నియంత్రణకు సంబంధించి సంస్థల యాజమాన్యాలను బాధ్యుల్ని చేయాలి. క్యాంపస్ లోపల డ్రగ్స్‌కు సంబంధించి ఏ ఘటనకైనా యాజమాన్యాలనే బాధ్యుల్ని చేయాలి. క్యాంపస్ బయట జరిగే కార్యకలాపాలు గుర్తించి సమాచారాన్ని అందించే వ్యవస్థను ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలి. విద్యాసంస్థలకు అధికారంతో పాటు బాధ్యతను అప్పగించాలి. విద్యార్థుల ప్రవర్తనలో మార్పులను గుర్తించేందుకు యాజమాన్యాలు ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసుకునేలా చూడాలి..'అని సీఎం చెప్పారు.

### సమాచారం కోసం టోల్ ఫ్రీ నంబర్

'డ్రగ్స్‌కు సంబంధించి సమాచారం అందించేందుకు విద్యాసంస్థల ఆవరణలో టోల్ ఫ్రీ నంబర్, ప్రత్యేక క్యూఆర్ కోడ్‌ను ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలి. డ్రగ్స్‌ను గుర్తించడం, మాని?పంచడం, శిక్షించడం అన్న మూడు దశలను సమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలి. డ్రగ్స్ స్వీకరించి పట్టుబడితే డీ అడిక్షన్ సెంటర్‌కు తరలించాలి. తరచూ పట్టుబడితే కఠినంగా శిక్షించే అంశాన్ని పరిశీలించండి. డ్రగ్స్ విషయంలో కఠినంగా వ్యవహరించేందుకు అవసరమైతే చట్టాన్ని రూపొందించే అంశంపై అధ్యయనం చేయండి..'అని ముఖ్యమంత్రి ఆదేశించారు. సమావేశంలో ప్రభుత్వ సలహాదారులు పి.సుదర్శన్‌రెడ్డి, కె.రామకృష్ణారావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, డీజీపీ సీవీ ఆనంద్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## దూరంగా నిర్మిస్తే నిరుపయోగమే!

-మొదటిపేజీ తరువాయి



ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు ఇబ్బందులు తలెత్తడంతో పాటు అవి నిరుపయోగంగా మారే అవకాశం ఉందని సీఎం అభిప్రాయపడ్డారు. ప్రజల పని ప్రదేశాలకు దగ్గరగా, జనావాసాల పరిధిలోనే ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తే నిరుపేదలు జీవనోపాధి కోల్పోకుండా ఉంటారని తెలిపారు.

### తొలి విడతలో 7680 ఫ్లాట్ల నిర్మాణం

క్యూర్ ఏరియాలోని పలు నియోజకవర్గాల్లో 528 చదరపు అడుగుల విస్తీర్ణంతో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ఇప్పటికే లాంఛనంగా ప్రారంభించారు. తొలి దశలో 17 నియోజకవర్గాల్లో 7,680 ఫ్లాట్లు నిర్మించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. రాజేంద్రనగర్, మహేశ్వరం, శేరిలింగంపల్లి, ఇబ్రహీంపట్నం, మల్కాజ్‌గిరి, నాంపల్లి, ఖైరతాబాద్, జూబ్లీహిల్స్, కార్వాన్, బహదూర్‌పురా, అంబర్‌పేట్, కూకట్‌పల్లి, మేడ్చల్, కుత్బుల్లాపూర్, సనత్ నగర్, సికింద్రాబాద్ కంటోన్మెంట్, మలక్‌పేట్ నియోజకవర్గాల్లో ప్రభుత్వం తొలి విడతలో ఇందిరమ్మ ఇళ్లను నిర్మించనుంది.

### ఖాళీ స్థలాలను వేగంగా గుర్తించండి

మిగతా నియోజకవర్గాల్లోనూ ఖాళీ స్థలాలను గుర్తించే ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. సమావేశంలో హైదరాబాద్ జిల్లా ఇన్?ఛార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రవాణాశాఖ ముఖ్య కార్యదర్శి వికాస్ రాజ్, డీజీపీ సీవీ ఆనంద్, సీఎం ముఖ్య కార్యదర్శి ఎన్ శ్రీధర్, రెవెన్యూ శాఖ కార్యదర్శి లోకేష్ కుమార్, వి.శేషాద్రి, హెచ్?ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ వీపీ గౌతమ్, కలెక్టర్ ప్రియాంక ఆల, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

అల్పాదాయ వర్గాలకోసం నిర్మించనున్న ఇందిరమ్మ ఇళ్లకోసం ఈనెల 21 నుంచి ఆగస్టు 10 వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. మీ సేవ కేంద్రాలు, మీ సేవ వెబ్‌సైట్, వాట్సాప్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని హౌసింగ్ బోర్డు తెలిపింది. రూ.100 దరఖాస్తు ఫీజుతో పాటు రూ.10 వేల డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుంది. ఒక వేళ ఫ్లాట్ రాకపోతే రూ.10 వేలు తిరిగి ఇస్తామని, వస్తే లబ్ధిదారుల వాటాలో తగ్గిస్తామని సర్కారు వెల్లడించింది.

### లబ్ధిదారులకు అవసరమైన అర్హతలు :

కనీసం పదేళ్ల నుంచి క్యూర్ పరిధిలోనే నివసించి ఉండాలి.
వార్షిక కుటుంబ ఆదాయం మొత్తం రూ.6 లక్షల వరకే ఉండాలి.
సొంత ఇళ్లు, ఫ్లాట్ లేదా ప్లాటు ఉండకూడదు.
ప్రస్తుతం నివసిస్తున్న నియోజకవర్గంలోనే ఇంటి కోసం దరఖాస్తు చేసుకోవాలి.
గతంలో ప్రభుత్వం నుంచి ఎలాంటి గృహ ప్రయోజనం పొంది ఉండకూడదు.
లబ్ధిదారులకు మొత్తం రూ.11 లక్షల్లో స్థలంతో పాటు రూ.5 లక్షల రాయితీని ప్రభుత్వం ఇస్తుంది. రూ.6 లక్షలను మాత్రం లబ్ధిదారులు చెల్లించాలి.

# తెలంగాణపై ఎల్‌నినో పడగ

-మొదటిపేజీ తరువాయి

నమోదైందని వ్యవసాయ శాఖ వెల్లడించింది. వర్షాకాలం ప్రారంభమై 53 రోజులు కావొస్తున్నా, కేవలం 27 రోజులు మాత్రమే వర్షాలు పడ్డాయి. గురువారం వరకు రాష్ట్రంలో సగటు వర్షపాతం 287.6 మిల్లీమీటర్లకు 217.4 మిల్లీమీటర్ల (24 శాతం) లోటు నమోదైంది. ఈ కారణంగా మొత్తం 1,32,38,446 ఎకరాల సాధారణ సాగు విస్తీర్ణంలో 67,78,234 ఎకరాల్లోనే పంటలు వేశారు. ఈ మేరకు రాష్ట్రంలో వానాకాలం సీజన్? స్థితిగతులపై వ్యవసాయ శాఖ గురువారం ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. వాటి వివరాలు ఇలా ఉన్నాయి.



### సీజన్‌లో తగ్గిన వరి సాగు

రాష్ట్రంలో మొత్తం 621 మండలాలకు 39 చోట్ల అధికం, 183లో సాధారణ వర్షం పడగా, 360 మండలాల్లో లోటు, 39 మండలాల్లో భారీ లోటు ఉంది. నీటి లభ్యత ఇతర అంశాలను పరిగణనలోనికి తీసుకుంటే ఈ సీజన్?లో వరి సాగు భారీగా తగ్గుతుంది. మొత్తం 65,95,645 ఎకరాలకు 38,51,214 ఎకరాల్లోనే సాగవుతుంది.

### ఈ ఏడాది 23 శాతం మాత్రమే

గతేడాది అంటే 2025 సంవత్సరం వర్షాకాలంలో 1,39,28,853 ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. ఈసారి 1,07,08,617 ఎకరాలకే పరిమితమయ్యే అవకాశముంది. గత ఏడాదితో పోలిస్తే 23.12 శాతం విస్తీర్ణంలో అంటే 32,20,236 ఎకరాల్లో పంటలు తగ్గుతాయి. గత సీజన్?తో పోలిస్తే ఈ వర్షాకాలంలో 48.66 శాతం పంటల విత్తనాలు మాత్రమే వేశారు.

ఇటీవల ఇన్‌ఛార్జి మంత్రులు నిర్వహించిన సమీక్షా సమావేశాల్లో వచ్చిన సూచనలను వ్యవసాయ శాఖ తన నివేదికలో రూపొందించింది. వర్షాభావం నేపథ్యంలో వరికి బదులు తక్కువ నీటితో సాగయ్యే చిరుధాన్యాలు, పప్పుధాన్యాలు, మక్కలు, ఉద్యాన పంటలు, నూనె గింజల పంటలను ప్రోత్సహించాలి. ఆయిల్‌పామ్ సాగుకు అనుకూల ప్రాంతాలను గుర్తించాలి.

ఆలస్యంగా వర్షాలు కురిసిన ప్రాంతాల్లో స్వల్పకాలిక పంట రకాలను సూచించాలి. నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను సకాలంలో సరఫరా చేయాలి.

బిందు, తుంపర్ల వంటి సూక్ష్మ నీటి పారుదల విధానాలను విస్తృతంగా అమలు చేయాలి. వర్షపు నీటి సంరక్షణకు సేద్యపు కుంటలు, ఇంకుడు గుంతల నిర్మాణాన్ని వేగవంతం చేయాలి. చెక్‌డ్యామ్‌లను బాగు చేయాలి. భూగర్భ జలాల వినియోగాన్ని క్రమబద్ధీకరించాలి.

ప్రత్యామ్నాయ పంటల విత్తనాలను రైతులకు జిల్లా వద్ద అందుబాటులో ఉంచాలి. మండల స్థాయిలో అత్యవసర విత్తన నిల్వలను నిర్వహించాలి.

వ్యవసాయ, ఉద్యానశాఖల అధికారులు రైతులకు గ్రామస్థాయిలో ప్రత్యక్ష సాంకేతిక సలహాలు అందించాలి. వ్యవసాయ, ఉద్యాన, పశు సంవర్ధక, నీటి పారుదల శాఖల మధ్య సమన్వయాన్ని పెంచాలి.

మండల స్థాయిలో ప్రత్యేక కంట్రోల్? రూమ్?లు ఏర్పాటు చేసి రైతుల సమస్యలకు తక్షణ పరిష్కారం చూపాలి.

### 462 మండలాల్లో లోటు వర్షపాతం

ఎల్‌నినో ప్రభావంతో నేల తడారిపోవడంతో నాటిన విత్తనాలు నేలలోనే మాడిపోతున్నాయి. మొలకొచ్చినవి నేల వాలుతున్నాయి. రాష్ట్రంలో 78 మండలాల్లో ఇప్పటి వరకు చుక్క వాన పడలేదు. మొత్తం 462 మండలాల్లో లోటు వర్షపాతం కొనసాగుతోంది. రాష్ట్రంలో 133 మండలాల్లో సాధారణ స్థాయి నెలకొంది. జూన్? 1 నుంచి జులై 19 వరకు 254.3 మి.మీటర్ల సాధారణ వర్షపాతం కురవాల్సి ఉండగా, 170.7 మి.మీ మాత్రమే కురిసింది. ములుగు మినహా మిగిలిన జిల్లాల్లో 33 శాతం లోటు వర్షపాతం నమోదైంది. గతేడాది వానాకాలంలో జులై 19 నాటికి 204.3 మి.మీ.లు కురిసింది. ఈసారి 13 శాతం లోటు నమోదైంది.

# పురానాపూల్ వంతెనకు కొత్త హంగులు

భాగ్యనగరం అనగానే గుర్తొచ్చేది కులీ కుతుబ్ షాహీ–భాగమతిల ప్రేమ. వారి ప్రేమకు గుర్తుగానే పాతబస్తీని కొత్త నగరానికి కలుపుతూ మూసీనదిపై నిర్మించిన తొలి వంతెన పురానాపూల్. భాగ్యనగర వాసులు ప్రేమగా ప్యారానాపూల్ అని పిలిచే ఈ వారధికి 448 ఏళ్ల చరిత్ర ఉంది. శతాబ్దాలుగా మూసీ నది వరదలను తట్టుకొని ఠీవీగా నిలబడింది. ఇన్నేళ్లు ఎన్నో ఆటుపోట్లను తట్టుకున్న ఈ వంతెన పాలకుల నిర్లక్ష్యంతో శిథిలావస్థకు చేరింది. ఈ సమస్యపై దృష్టి సారించిన రాష్ట్ర ప్రభుత్వం పురానాపూల్ వంతెనకు కొత్త సొబగులు అద్దాలని నిర్ణయించింది. మూసీనది పునరుజ్జీవంలోభాగంగా సుమారు 10 కోట్ల రూపాయలతో ఈ వంతెనకు కొత్త హంగులు అద్దేందుకు సిద్ధమైంది.

### ప్రేమ వంతెనగా పేరుపొందిన పురానాపూల్ బ్రిడ్జ్

భాగ్యనగర ఆనవాళ్లల్లో ప్రేమ వంతెనగా పేరుపొందిన పురానా పూల్ వంతెనను పునరుద్ధరించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. మూసీ నది పునరుద్ధరణలో భాగంగా మూసీ నదిపై నిర్మించిన తొలి వంతెన కాలగర్భంలో కలిసిపోకుండా ఉండాలనే ఉద్దేశంలో దానిని మరింతగా ఆధునీకరించి భవిష్యత్తు తరాలకు అందించాలని యోచిస్తోంది.

### రెండు నగరాలను కలుపుతూ మూసీనదిపై తొలి వంతెన

1578లో ఈ వంతెనను కుతుబ్?షాహీలు నిర్మించారు. మూసీ నదికి రెండు వైపులా ఉన్న నగరాన్ని అనుసంధానం చేసేందుకు ఈ వారధి ప్రముఖ పాత్ర పోషించింది. భాగమతి ప్రేమకు గుర్తుగా మహ్మద్? కుతుబ్?షాహీ ఈ వంతెనను నిర్మించారు. అంటే ఈ వారధిని నిర్మించి సుమారు 448 సంవత్సరాలు గడుస్తోంది.

### ఇప్పటికీ మూసీ నదిపై దర్శనం

నాలుగు శతాబ్దాల నాటి ఈ చారిత్రక సంపదగా ఇప్పటికీ మూసీ నదిపై దర్శనమిస్తోంది. ఈ వంతెన పొడవు 600 మీటర్లు, వెడల్పు 35 అడుగులతో, నది అడుగు నుంచి 54 అడుగుల ఎత్తున, 22 ఆర్చిలతో దీనిని నిర్మించారు.

### నాటి ఇంజినీర్ల ప్రతిభ

నేటి ఆధునిక కాలంలో నిర్మించిన నిర్మాణాలు కేవలం పదుల సంవత్సరాల్లోనే కూలుతున్నాయి. అయితే వందల ఏళ్లు గడుస్తున్నా ఈ వంతెన చెక్కుచెదరకుండా ఉండటం నాటి ఇంజినీర్ల ప్రతిభకు అద్దం పడుతోంది.

### గోల్కొండ నుంచి హైదరాబాద్‌కు రాకపోకలు

ఈ నిర్మాణం పూర్తయినప్పటి నుంచి గోల్కొండ నుంచి హైదరాబాద్?కు రాకపోకల కష్టాలు తప్పాయి. దీంతో వాణిజ్యానికి , నగర అభివృద్ధికి ఈ మార్గం ఎంతగానో దోహదపడింది. కాలం గడుస్తున్న కొద్ది క్రమంగా ఇది శిథిలావస్థకు చేరుకుటోంది. గత పాలకుల నిర్లక్షంగా వ్యవహరించడంతో చారిత్రక ఆనవాళ్లు కోల్పోయే ప్రమాదంలో పడింది. ప్రస్తుతం ఈ వంతెన చిరు వ్యాపారులకు అడ్డాగా మారింది. వంతెన కిందిభాగమంతా పిచ్చి మొక్కలు దర్శనమిస్తున్నాయి. పెరిగన మొక్కల కారణంగా వంతెన కిందిభాగంలోని రాళ్లకు, కాంక్రిట్?కు పగుళు ఏర్పడే ప్రమాదముంది.

### వాహనాల రాకపోకలను పూర్తిగా నిషేంధం

ఈ పరిస్థితులు నెలకొనడంతో పాటు చిరు వ్యాపారులకు అడ్డాగా మారడంతో కేవలం ద్విచక్రవాహనాలకు మాత్రమే దానిపై వెళ్లేందుకు అనుమతినిస్తున్నారు. భవిష్యత్తులో దీనిపై వాహనాల రాకపోకలను పూర్తిగా నిషేంధించనున్నారు.

### పాతబస్తీ సంస్కృతి ప్రతిబింబించేలా

వంతెన పునరుద్ధరణలో భగాంగా పర్యాటక శాఖ ప్రణాళికను రూపొందించింది. వంతెన సమీపంలో అత్యాధునిక సదుపాయాలను కల్పించనుంది. బ్రిడ్జిపై కూర్చొనేందుకు బెంచీలను ఏర్పాటు చేయనుంది. మూసీ నది అందాలు, పాతబస్తీ సంస్కృతి ప్రతిబింబించేలా ప్రత్యేక వ్యూపాయింట్లను ఏర్పాటు చేయనుంది. వంతెన రూపం రాత్రి సమయంలో సుందరంగా కనిపించేలా ప్రత్యేక లైట్లు ఏర్పాట్లు చేయనుంది. వాకింగ్ ట్రాక్‌లను కూడా అభివృద్ధి చేయనుంది.



### వంతెనకు పూర్వ వైభవం

రసాయన సాంకేతికను వినియోగించి వందల ఏళ్లనాటి చరిత్ర కనుమరుగు కాకుండా జాగ్రత్తలు తీసుకొని భవిష్యత్ తరాలకు అందించనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో

## సంపాదకీయం

# కాంగ్రెస్ పార్టీకి నీట్ బూస్ట్

జాతీయస్థాయిలో కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం వస్తుందా అన్న చర్చ రాజకీయ వర్గాల్లో జోరుగా సాగుతోంది. నీట్ పేపర్ లీకేజీ ఉదంతంపై విద్యార్థులు చేపట్టిన ఆందోళనలు, ఢిల్లీలో జరిగిన లాఠీచార్జిని నిరసిస్తూ లోక్‌సభలో విపక్ష నేత (ఎల్ఓపీ) రాహుల్ గాంధీ చేపట్టిన మెరుపు ధర్నా దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఇదే సమయంలో పలు రాష్ట్రాల్లో కాంగ్రెస్ కార్యాలయాలపై జరిగిన దాడులు ఆ పార్టీకి రాజకీయంగా సానుభూతిని తెచ్చిపెడుతున్నాయనే విశ్లేషణలు వెలువడుతున్నాయి. ఈ పరిణామాలు జాతీయ రాజకీయాల్లో కాంగ్రెస్ పునరుజ్జీవ ప్రయత్నాలకు ఊతమిస్తాయా అన్న కోణంపైనా విస్తృత చర్చ జరుగుతోంది దేశాన్ని సుదీర్ఘకాలం పాలించిన గ్రాండ్ ఓల్డ్ పార్టీ కాంగ్రెస్. అయితే ఇదంతా గతం, ఇప్పుడు పరిస్థితి వేరు. గతం ఒక ఘన చరిత్ర అన్నట్లుగానే కొన్నాళ్లుగా కాంగ్రెస్ పరిస్థితి తయారైంది. అయితే ఇప్పుడు పరిస్థితులు కుదటపడుతున్న వాతావరణం కనిపిస్తోందని విశ్లేషణలు వ్యక్తమవుతున్నాయి. 2014లో కేంద్రంలో అధికారం కోల్పోయి, ఆ తర్వాత వరుసగా జరిగిన రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో వైఫల్యంతో కాంగ్రెస్ పార్టీ కుదేలైంది. 2014, 2019 సార్వత్రిక ఎన్నికల్లో కనీస ప్రతిపక్ష హోదా కూడా దక్కించుకోలేకపోయింది. అయితే గత పార్లమెంటు ఎన్నికల్లో 99 సీట్లతో ప్రతిపక్షంగా నిరూపించుకున్న కాంగ్రెస్ ఇప్పుడు అధికార ఎన్డీఏ, మరీ ముఖ్యంగా బీజేపీపై వెన్నుచూపని పోరాటం చేస్తుండటం హాట్ టాపిక్ అవుతోంది. లోక్ సభలో ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న కాంగ్రెస్ ఇప్పుడు సరికొత్త పంథాతో రాజకీయం చేస్తున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. జాతీయ పార్టీగా ఇండియా కూటమికి నాయకత్వం వహిస్తున్న కాంగ్రెస్ మిగిలిన విపక్షాలను కలుపుకుని పోవడంలో గతం కంటే మెరుగైన విధంగా పనిచేస్తోందని అంటున్నారు. కాకపోతే ఆయా పార్టీలు స్థానిక పరిస్థితులు, అంతర్గత కారణాలతో నిర్లిప్తంగా మారుతున్నా, ఆయా ప్రాంతీయ పార్టీల అగ్ర నాయకత్వానికి కాంగ్రెస్ అండగా నిలుస్తూ తనను తాను మలుచుకుంటున్న తీరు ఆకట్టుకుంటోందని అంటున్నారు. ఇదే సమయంలో కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపడంలోనూ కాంగ్రెస్ దూకుడుగా వ్యవహరిస్తోందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రధాని మోదీ ఇంటి ముందు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాను ఇందుకు తాజా ఉదాహరణగా చూపుతున్నారు. వారసత్వంగా కాంగ్రెస్ పగ్గాలు చేపట్టిన రాహుల్.. ఆ పార్టీకి పునరుజ్జీవం తేవడానికి ఎంతో ప్రయత్నిస్తున్నారు. అయితే వరుసగా మూడు ఎన్నికల్లో ఆయన వైఫల్యం చెందినా నాయకుడిగా ఇప్పుడిప్పుడు తనను తాను నిరూపించుకుంటున్నారని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. ప్రధానంగా 2024 ఎన్నికల ముందు నుంచి రాహుల్ తీరులో మార్పు వచ్చిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. భారత్ జోడో యాత్ర ద్వారా పాదయాత్ర చేసి ప్రజలకు దగ్గరయ్యేలా ప్రయత్నాలు చేసిన రాహుల్ ఇప్పుడు దేశం ఏం కోరుకుంటుందన్న విషయమై అవగాహన పెంచుకున్నారని అంటున్నారు. దీంతో సమయానుకూలంగా స్పందిస్తూ కాంగ్రెస్ పార్టీని చక్కదిద్దేలా చురుగ్గా అడుగులు వేస్తున్నారని చెబుతున్నారు ప్రస్తుతం నీట్ పేపర్ లీక్ వ్యవహారం జాతీయస్థాయిలో కుదిపేస్తుండగా, ఈ విషయంలో కాంగ్రెస్ ఎంటర్ అయిన తీరుతో పరిస్థితి ఒక్కసారిగా మారిపోయిందనే అంచనాలు వెలువడుతున్నాయి. ఈ విషయమై సుదీర్ఘ పోరాటం జరుగుతుండగా, ఈ నెల 20న నిర్వహించిన పార్లమెంట్ మార్చ్ పరిస్థితిని ఒక్కసారిగా మార్చేసిందని అంటున్నారు. ఆ రోజు కేంద్ర బలగాలు విద్యార్థులపై లాఠీచార్జి చేయడాన్ని నిరసిస్తూ రాహుల్ గాంధీ చేసిన మెరుపు ధర్నా దేశవ్యాప్తంగా విస్తృత చర్చకు దారితీసింది. అంతేకాకుండా 21న రాహుల్ తోపాటు కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, జాతీయ నేతలు కూడా కేంద్రంపై ఒత్తిడి చేసేలా ఆందోళనలు చేయడం, ఈ విషయంలో బీజేపీ కూడా ఒక అడుగు వెనక్కి తగ్గినట్లు సంకేతాలు ఇవ్వడం కాంగ్రెస్ పార్టీకి సానుకూలంగా మారిందనే వ్యాఖ్యానాలు వినిపిస్తున్నాయి. మొత్తానికి తాజా పరిణామాలు కాంగ్రెస్ పార్టీకి బూస్ట్ ఇచ్చినట్లుగా చెబుతున్నారు మరో వైపు ట్ ప్రశ్నాపత్రం లీక్‌కు వ్యతిరేకంగా దేశ రాజధాని ఢిల్లీలో విద్యార్థులు కొనసాగిస్తున్న ఆందోళనలపై బీజేపీ సీనియర్ నేత మురళీ మనోహర్ జోషి స్పందించారు. దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన యువత కొన్ని రోజులుగా ఢిల్లీ వీధుల్లో నిరసనలు కొనసాగించడం చాలా బాధకరమని ఆయన అన్నారు. పరీక్షలపై వారి ఆందోళనలు, సమస్యలు నిజమైనవని, సానుభూతితో పరిష్కరించాలని ఆయన సూచించారు. దీనిని బలప్రయోగం ద్వారా అణచివేసే శాంతిభద్రతల సమస్యగా చూడరని తాను ఆశిస్తున్నానని కేంద్ర ప్రభుత్వానికి చురకలంటించారు. ఇటువంటి చర్యలు వికసిత్ భారత్ లక్ష్యానికి అనేక వర్గాలను దూరం చేస్తుందని ఈ మేరకు ఆయన సోషల్ మీడియా వేదికగా స్పందించారు.'దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన యువ విద్యార్థులు కొన్ని రోజులుగా న్యూఢిల్లీ రోడ్లపై పడిగాపులు కాయడం తీవ్ర బాధాకరం... పరీక్షల వ్యవస్థలపై వారి ఆందోళనలు, భయాలు సమస్యలు నిజమైనవి... వాటికి సానుభూతితో, దీర్ఘకాలిక పరిష్కారాలతో బదులివ్వాలి... దీనిని కేవలం బలప్రయోగం ద్వారా అణచివేసే శాంతిభద్రతల సమస్యగా మాత్రమే చూడరని నేను మనస్ఫూర్తిగా ఆశిస్తున్నాను.. నిరసనలు తెలుపుతున్న మహిళలు, యువతులపై క్రూరంగా వ్యవహరించడం నన్ను తీవ్రంగా కలచివేసింది... ఇలాంటి బలప్రయోగం దేశాన్ని 'వికసిత్ భారత్‌గా' తీర్చిదిద్దాలనే జాతీయ లక్ష్యం నుంచి అనేక వర్గాలను దూరం చేస్తుంది" అని మురళీ మనోహర్ జోషీ కేంద్రంపై పరోక్షంగా విమర్శలు గుప్పించారు.

# నీట్ విధానాన్ని పూర్తిగా ఎత్తివేయాల్సిందే!




నీట్ పరీక్ష లీక్ అవడం ఈ ఏడాదే మొదటిసారి కాదు. 2021లో, 2024లోనూ లీక్ అయింది. 2024లో ప్రశ్నపత్రం లీక్ అయినప్పుడు కూడా నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) అసమర్థతపైన చాలా చర్చ జరిగింది. ఎన్టీఏ నిర్లక్ష్యం, భద్రతా లోపాలపై అప్పటి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. భవిష్యత్తులో ఇలాంటి లీకేజీలు జరుగకుండా ఉండేందుకు నిపుణుల కమిటీని ఏర్పాటు చేయాలని ఆదేశించింది. ఈ మేరకు ఇస్రో మాజీ చైర్మన్ కె.రాధాకృష్ణన్ నేతృత్వంలో నిపుణుల కమిటీని కేంద్రం ఏర్పాటు చేసింది. నీట్ పరీక్ష నిర్వహణపై అధ్యయనం చేసిన ఈ కమిటీ పరీక్ష సక్రమంగా జరగాలంటే మరింత కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సూచిస్తూ ప్రశ్నపత్రాల రవాణా, డిజిటల్ భద్రత, సైబర్ సెక్యూరిటీ, పరీక్ష కేంద్రాల ఎంపిక, డేటా రక్షణ, అభ్యర్థుల ఆధార్ ధృవీకరణ వంటి కమిటీ 10 కీలక విభాగాల్లో సంస్కరణలపై 101 సిఫారసులు చేసింది. నీట్‌ను పెన్ అండ్ పేపర్ విధానంలో కాకుండా కంప్యూటర్ పద్ధతిలో నిర్వహించాలని కీలకమైన ప్రతిపాదన చేసింది. కానీ, కేంద్రం పట్టించుకోలేదు. ఫలితంగా 2026లో మళ్లీ పేపర్ లీక్ అయింది.

నీట్ పరీక్ష నిర్వహణే కాదు, అసలు ఈ పరీక్ష విధానాన్ని తీసుకురావడమే ఒక రకమైన వివాదం. ముఖ్యంగా తమిళనాడు రాష్ట్రం నీట్ పరీక్షను సమాఖ్య వ్యవస్థపై దాడిగా మొదటి నుంచీ వ్యతిరేకిస్తూ ఉన్నది. నీట్ రాకముందు మెడికల్ ప్రవేశాలకు దేశవ్యాప్తంగా ఏకీకృత ప్రవేశ పరీక్ష ఉండేది కాదు. అభ్యర్థులు వేర్వేరు ప్రవేశ పరీక్షలు రాయాల్సి వచ్చేది. ప్రతి రాష్ట్రం తమ పరిధిలోని కాలేజీల్లో ప్రవేశాలకు సొంతంగా ప్రవేశ పరీక్షలను నిర్వహించేవి. ఉదాహరణకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎంసెట్, తమిళనాడులో టీఎన్‌సెట్, కర్ణాటకలో కేసెట్.. ఇలా ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రం పరీక్షలు నిర్వహించేవి. ఇక అఖిల భారత కోటా 15% సీట్ల కోసం ఏఐపీఎంటీ (ఆలిండియా ప్రీ మెడికల్ టెస్ట్) ఉండేది. అలాగే ఎయిమ్స్, జిప్మర్ వంటి సంస్థలు, కొన్ని ప్రైవేట్ మెడికల్ కాలేజీలు, డీమ్డ్ యూనివర్సిటీలు సొంత ప్రవేశ పరీక్షలను నిర్వహించేవి. 'ఒకే దేశం–ఒకే ప్రవేశ పరీక్ష' అనే నినాదంతో కేంద్రం నీట్ పరీక్షను తీసుకువచ్చింది. అయితే, దీనివల్ల విద్యార్థులు 10–15 వేర్వేరు పరీక్షలు రాయాల్సి వస్తున్నదని, ఇన్ని పరీక్షలకు ఫీజులు చెల్లించడం విద్యార్థులకు కష్టంగా ఉండేది. అలాగే వేర్వేరు నగరాల్లో సెంటర్లు పడితే, అక్కడికి వెళ్లి పరీక్ష రాయడం ఇబ్బందికరంగా మారేది. అలాగే ఒక్కో ప్రవేశ పరీక్షకు ఒక్కో సిలబస్ ఉండటం వల్ల విద్యార్థులు తీవ్ర ఒత్తిడి లోనయ్యేవారు. నీట్ పరీక్ష అంత సులభంగా ఏమీ అమల్లోకి రాలేదు. మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా 2010లో జాతీయ స్థాయిలో ఒకే ప్రవేశపరీక్ష ప్రతిపాదన తీసుకువచ్చింది. ఆ తర్వాత మూడేండ్లకు 2013 మే 5న దేశంలో తొలిసారిగా నీట్ పరీక్ష నిర్వహించారు. కానీ న్యాయపరమైన చిక్కుల వల్ల అది రద్దయింది. నీట్‌ను వ్యతిరేకిస్తూ ప్రైవేట్ మెడికల్ కాలేజీలు, కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు సుప్రీంకోర్టుకు వెళ్లాయి. విచారణ జరిపిన అప్పటి సీజేఐ అల్తమస్ కబీర్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం 2013 జులై 18న 2:1 మెజారిటీతో నీట్‌ను రద్దు చేసింది.

దేశవ్యాప్తంగా ప్రైవేట్ కాలేజీలు, రాష్ట్రాల రాజ్యాంగ హక్కులపై ఒకే పరీక్షను రుద్దే అధికారం ఎంసీఐకి లేదు అని పేర్కొంది. దీంతో 2014, 2015లలో పాత విధానమే కొనసాగింది. ఇక్కడ ఆశ్చర్యకరమైన విషయం ఏంటంటే 2015లో కూడా ఈ మెడికల్ ఎంట్రెన్స్ ప్రశ్నపత్రం లీక్ అయింది. పరీక్షను మళ్లీ నిర్వహించాల్సి వచ్చింది.

నీట్‌ను రద్దు చేయాలన్న త్రిసభ్య ధర్మాసనం తీర్పుపై కేంద్ర ప్రభుత్వం, ఎంసీఐ దాఖలు చేసిన రివ్యూ పిటిషన్‌ను విచారించిన జస్టిస్ ఎ.ఆర్.దవే నేతృత్వంలోని ఐదుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం 2016 ఏప్రిల్ 11న 2013 నాటి తీర్పును రద్దు చేసింది. పాత తీర్పులో సరైన చర్చ జరగలేదని, వైద్య విద్యలో పారదర్శకత ముఖ్యమని పేర్కొంటూ నీట్ విధానాన్ని పునరుద్ధరించింది.

నీట్ వల్ల జాతీయ స్థాయిలో పోటీకి విద్యార్థులకు ఒకే వేదిక ఉంటుందని, మెరిట్ విద్యార్థులకు మేలు జరుగుతుందని భావించారు. కానీ, వాస్తవంలో అలా జరుగలేదు. ఎందుకంటే నీట్ సిలబస్ పూర్తిగా ఎన్సీఈఆర్టీ/సీబీఎస్ఈ ఆధారితంగా ఉంటుంది. పలు రాష్ట్రాల్లో, ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాల్లో సిలబస్ వేరు. బోధన కూడా చాలా వరకు ఆయా రాష్ట్రాల స్థానిక భాషల్లో ఉంటుంది. పిల్లలను సీబీఎస్ఈ స్కూళ్లలో చేర్పిద్దామా అంటే చాలా ఖర్చుతో కూడుకున్న వ్యవహారం. అందుకు సరిపడా స్కూళ్లు కూడా లేవు. ఇందువల్ల విద్యార్థులకు నష్టం జరిగింది.

నీట్‌కు ముందు ప్రతిష్టాత్మక విద్యా సంస్థలు, ప్రైవేట్ కాలేజీలు మేనేజ్‌మెంట్ కోటా పేరుతో ఒక్కో విద్యార్థి నుంచి రూ.లక్షల్లో డొనేషన్లు వసూలు చేసేవి. ఈ పరిస్థితుల్లో మెరిట్ ఉన్న విద్యార్థులకు నీట్ వల్ల మేలు జరుగుతుందని పలువురు భావించారు. వైద్య విద్యాప్రమాణాలు దేశమంతటా ఒకేలాగా ఉంటాయని ఆశించారు. కానీ నీట్ వల్ల రాష్ట్ర ప్రభుత్వ స్టేట్ బోర్డుల్లో చదివిన గ్రామీణ విద్యార్థులు నష్టపోయారు. పేద విద్యార్థుకు నీట్ పరీక్ష చాలా ఇబ్బందిగా మారింది. ప్రత్యేకంగా కోచింగ్‌లకు వెళ్లాల్సిన పరిస్థితి మరింతగా పెరిగింది. ఇది విద్యార్థుల్లో ఒత్తిడి ఎక్కువయింది. కోచింగ్ ఫీజులు చెల్లించగలిగే వాళ్లకు, పట్టణ ప్రాంత విద్యార్థులకు ఎక్కువగా నీట్‌లో ర్యాంకులు రాసాగాయి. తమిళనాడు ప్రభుత్వం వేసిన ఏకే రాజన్ కమిటీ కూడా ఇదే విషయాన్ని స్పష్టం చేసింది. అందుకే నీట్‌ను రద్దు చేయాలని తమిళనాడు రాష్ట్రం మొదటి నుంచీ డిమాండ్ చేస్తున్నది.

రాజ్యాంగంలో 'విద్య' అనేది ఉమ్మడి జాబితాలో ఉన్నది. ఆరోగ్య రంగం రాష్ట్ర పరిధిలోకి వస్తుంది. నీట్ వల్ల రాష్ట్రాల్లోని మెడికల్ కాలేజీల సీట్ల భర్తీపై కేంద్రానికి (ఎన్టీఏ) పూర్తి ఆధిపత్యం లభించినట్టయింది. ఇది సమాఖ్య విధానానికి విరుద్ధమని పలు రాష్ట్రాలు వాదిస్తున్నాయి. తమ ప్రజల పన్నుల డబ్బుతో నిర్మించిన మెడికల్ కాలేజీల్లో ప్రవేశాలను కేంద్రం చేతుల్లో పెట్టడానికి సమ్మతించబోమని అభ్యంతరం తెలుపుతున్నాయి. వీటన్నింటికి తోడు ఉత్తరాది రాష్ట్రాల్లోని సామాజిక, రాజకీయ, ఆర్థిక పరిస్థితులు నీట్ పరీక్ష విధానంపై అనుమానాలు రేకెత్తిస్తున్నాయి.

నీట్‌లో ఆలిండియా కోటాలో ర్యాంక్ సాధించి, తెలంగాణలోని మెడికల్ కాలేజీల్లో సీట్లు పొందిన విద్యార్థులు ఇక్కడివారితో పోటీ పడలేక పోతున్నారు. చదువులో అంత వెనుకబడి ఉన్నవారు ఆలిండియా కోటాలో ర్యాంకులు ఎలా సాధిస్తున్నారన్న ప్రశ్నలూ వెల్లువెత్తుతున్నాయి.

తెలంగాణలో రికార్డ్ స్థాయిలో 10 వేలకు పైగా ఎంబీబీఎస్ సీట్లు ఉన్నాయి. ఇందులో ప్రభుత్వ కాలేజీల్లో 4,400 సీట్లు, ప్రైవేట్ కాలేజీల్లో 5,850 సీట్లు ఉన్నాయి. ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో స్థానిక విద్యార్థులకు 85%, ఆలిండియా కోటాలో ఇతర రాష్ట్రాల విద్యార్థులకు 15 శాతం సీట్లు ఉంటాయి. అంటే మన రాష్ట్రంలోని కాలేజీల్లోని 660 సీట్లను ఆలిండియా కోటాలో ఇతర రాష్ట్రాల విద్యార్థులకు కేటాయిస్తున్నారు. మరి ఈ మేరకు తెలంగాణ విద్యార్థులు ఆలిండియా కోటాలో వేరే రాష్ట్రాల్లోకి వెళ్తున్నారా..? నీట్ వల్ల మన రాష్ట్ర విద్యార్థులకు ప్రయోజనం ఉన్నదా? అంటే అంతగా ఏమీ లేదు. జాతీయ స్థాయిలో ప్రతిష్టాత్మక విద్యా సంస్థలను వదిలేసి వేరే రాష్ట్రాల్లోని మెడికల్ కాలేజీల్లో విద్యను అభ్యసిస్తున్న తెలంగాణ విద్యార్థుల సంఖ్య చాలా తక్కువగా ఉన్నది. ఇక ప్రైవేట్‌లోనూ 50 శాతం స్థానిక కోటా ఉంటుంది. వెరసి ఇక్కడి విద్యార్థులు ఇక్కడే చదువుకుంటున్నారు. నీట్ వల్ల మన విద్యార్థులకు పెద్దగా ఒనగూరే ప్రయోజనం ఏమీ లేదు.

నీట్‌పై రాష్ట్రాల అభ్యంతరాలు, లీకేజీల సమస్య, అర్హత లేని ఉత్తరాది విద్యార్థులు కూడా లీకులు, ఇతర బలవంతపు చర్యలతో ఆలిండియా ర్యాంకులు సాధిస్తున్నారన్న అనుమానాలు విమర్శల నేపథ్యంలో, ముఖ్యంగా తాజాగా జరుగుతున్న విద్యార్థి ఉద్యమాన్ని దృష్టిలో పెట్టుకొని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మెడికల్ ఎంట్రెన్స్ పరీక్షలో సంస్కరణ చర్యలు చేపట్టాలి. భారతదేశం భిన్నత్వంలో ఏకత్వం ఉన్న దేశం. అందుకే రాష్ట్రాల్లోని ప్రత్యేక పరిస్థితులను కేంద్రం పరిగణనలోకి తీసుకోవాలి. రాష్ట్ర వైద్య కళాశాలలకు రాష్ట్ర ప్రవేశ పరీక్షలు నిర్వహించే విధానాన్ని కేంద్ర చట్టం ద్వారా పునరుద్ధరించాలి. ఆలిండియా కోటా సీట్లకు, ప్రతిష్టాత్మక విద్యాసంస్థలకు అన్నింటికీ కలిపి ఒకే ప్రవేశపరీక్ష ఉండేలాగా చర్యలు తీసుకోవచ్చు. జాతీయ ప్రమాణాలు, రాష్ట్రాల స్వయం ప్రతిపత్తి అనేవి పరస్పర వైరుధ్యాలు కావు. నాణ్యమైన వైద్యవిద్యా, సమాన అవకాశాలు, సామాజిక న్యాయం, సమాఖ్య స్ఫూర్తి లక్ష్యాలను సమన్వయం చేసే సమతుల్య విధానమే భారతదేశానికి అవసరం.

రాజ్యాంగంలో 'విద్య' అనేది ఉమ్మడి జాబితాలో ఉన్నది. ఆరోగ్య రంగం రాష్ట్ర పరిధిలోకి వస్తుంది. నీట్ వల్ల రాష్ట్రాల్లోని మెడికల్ కాలేజీల సీట్ల భర్తీపై కేంద్రానికి (ఎన్టీఏ) పూర్తి ఆధిపత్యం లభించినట్టయింది. ఇది సమాఖ్య విధానానికి విరుద్ధమని పలు రాష్ట్రాలు వాదిస్తున్నాయి. తమ ప్రజల పన్నుల డబ్బుతో నిర్మించిన మెడికల్ కాలేజీల్లో ప్రవేశాలను కేంద్రం చేతుల్లో పెట్టడానికి నిరాకరిస్తున్నాయి.

# సౌదీలో 'అణు'కుంపటి



అందరి సలహాలూ బేఖాతరు చేసి ఇరాన్‌పై యుద్ధ భేరి మోగించి పశ్చిమాసియాను అగ్నిగుండంగా మార్చిన అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్... ఇప్పుడు మరో ప్రమాదకర క్రీడకు సిద్ధపడ్డారు. సౌదీ అరేబియాతో తమకు 'శాంతియుత అణు సహకార ఒప్పందం' కుదిరిందంటూ అమెరికా ఇంధన శాఖ విడుదల చేసిన తాజా ప్రకటన ప్రకంపనలు రేపుతోంది. తన నిర్ణయం పర్యవసానాలూ, పరిణామాల గురించి పూర్తిగా తెలిసే ట్రంప్ ఇందుకు సిద్ధపడ్డారా అనే సందేహం అందరిలో తలెత్తుతోంది. ఇది పశ్చిమాసియా అమరికను సంపూర్ణంగా మార్చే... ఇప్పటికే సాగుతున్న ఆయుధ పోటీని మరింత పెంచే ప్రమాదకర నిర్ణయం. 30 యేళ్లపాటు కొనసాగే ఈ ఒప్పందం కింద యురేనియం శుద్ధికి అవసరమైన సామర్థ్యాన్ని సౌదీ సంతరించుకుంటుందని, అణ్వస్త్రవ్యాప్తి నిరోధక ప్రమాణాలను సాధించటంతోపాటు ప్రాంతీయ భద్రతకూ, అమెరికా భద్రతకూ కూడా తోడ్పడుతుందని అమెరికా అంటోంది.

రాగలకాలంలో దేశానికి ఇది వందలకోట్ల వాణిజ్యాన్ని తీసుకొస్తుందనీ... దేశ ఆర్థిక, వ్యూహాత్మక లక్ష్యాలు నెరవేరటానికి దోహదపడుతుందనీ కూడా చెప్పుకుంటోంది. ఒకపక్క తన చర్యల ద్వారా అణ్వాయుధ తయారీకి దోహదపడుతూ అణ్వస్త్ర వ్యాప్తి నిరోధమే ధ్యేయమని చెప్పటం ఉత్త వంచన. ఈ అణు ఒప్పందం 2008లో మన్మోహన్ సింగ్ తొలి ఏలుబడిలో మన దేశంతో అమెరికా కుదుర్చుకున్న '123' ఒప్పందమే కదా అనిపిస్తుంది. అగ్రరాజ్యాలతోపాటు మనతోసహా పలు దేశాల దగ్గర అణ్వాయుధాలున్నాయి. అదనంగా సౌదీ దగ్గర ఉంటే నష్టమేమిటన్న సందేహాలు కూడా కలుగుతాయి. పైగా ఇది పౌర అణు ఒప్పందమే అనిపిస్తుంది. కానీ తరచిచూస్తే ఇందులో లొసుగులు బయటపడతాయి. సౌదీ అణువిద్యుత్ ప్రాజెక్టులు స్థాపించుకోవటానికే ఇది ఉపయోగపడుతుందని అమెరికా వాదన.

ప్రకృతిలో లభించే యురేనియంలోని రెండు ఐసోటోపుల్లో ఒకటైన యూ–– 235 మాత్రమే అణు విచ్ఛేదనానికీ, గొలుసు చర్య జరిగి అపారమైన శక్తి విడుదలకూ తోడ్పడు తుంది. యురేనియంను 3 నుంచి 5 శాతంవరకూ శుద్ధి చేస్తే అణు విద్యుత్ ఉత్పాదన సాధ్యమవుతుంది. శుద్ధి 90 శాతానికి చేరితే అణుబాంబు తయారీకి ఉపయోగపడుతుంది. అయితే విద్యుదుత్పాదన తర్వాత వాడేసిన ఇంధనంతో ప్లూటోనియం తయారీ అవకాశం ఎప్పుడూ ఉంటుంది. దాన్ని నిరోధించేందుకే 'గోల్డ్ స్టాండర్డ్' పేరుతో అమెరికా కఠినమైన షరతు విధిస్తోంది. దాన్నుంచి సౌదీకి మినహాయింపు ఇవ్వటం పైనే అందరికీ ఆందోళన. ఆ షరతు ఉంటుందని తాజాగా అమెరికా ఇస్తున్న వివరణ నమ్మశక్యంగా లేదు.

అణ్వస్త్ర వ్యాప్తి నిరోధక ఒప్పందం(ఎన్‌పీటీ)పై ఇరాన్ సంతకం చేసినా, అణుబాంబు తయారీకి వ్యతిరేకంగా అక్కడ ఫత్వా అమల్లో ఉన్నా ఆ దేశం అణు బాంబుకు సిద్ధపడుతోందన్న సంశయాలు అమెరికాకూ, ఇజ్రాయెల్‌కూ ఉన్నాయి. తరచు ఇరాన్‌పై అమెరికా విరుచుకుపడటానికి కారణం అదే. 'ఇరాన్ ఆ పని చేస్తే... మేం సైతం ఆ బాటలోనే వెళ్తాం' అని సౌదీ ప్రిన్స్ మహమ్మద్ బిన్ సల్మాన్ గత కొన్నేళ్లుగా పదే పదే చెబుతున్నారు. అలాంటి దేశానికి మినహాయింపు ఇవ్వటమంటే బాహాటంగా దాన్ని అణ్వస్త్ర దేశంగా మారడానికి ప్రోత్సహించటమే అవుతుంది. అమెరికా మిత్రులు ఏం చేసుకున్నా మినహాయింపునిస్తాం... శత్రుదేశాలను మాత్రం నిరుత్సాహపరుస్తాం' అనే నైజం అత్యంత ప్రమాదకరమైనది.

'మనిషి అణుబాంబును కనిపెట్టాడు. కానీ ప్రపంచంలో ఏ ఎలుకా ఎలుకలబోను తయారుచేసుకోదు' అని ఐన్‌స్టీన్ చేసిన వ్యాఖ్య ఆంతర్యం స్పష్టమే. ఇది స్వీయ హననానికి దారితీసే తెలివిమాలిన చర్య. భవిష్యత్తులో అణుశక్తి దేశంగా మారాక సౌదీ, అమెరికా చెప్పుచేతల్లో ఉండదు. తాము చేస్తే తప్పేమిటని ఇరాన్ సైతం ఆ బాట పడుతుంది. చిన్న నిప్పురవ్వ కూడా ఆ ప్రాంతాన్ని ఇప్పుడే భగ్గున మండిస్తుంటే ఇక అణ్వాయుధాలుంటే చెప్పేదేముంది? ఇప్పటికే ఇజ్రాయెల్ స్వీయరక్షణకంటూ అమెరికా దానికి అణ్వాయుధాలు సరఫరా చేసింది. దాని రక్షణ పేరుచెప్పే తరచు ఇరాన్‌పై దాడులు చేస్తోంది. నిజానికి స్వతంత్ర పాలస్తీనా ఆవిర్భవిస్తే ఇజ్రాయెల్‌కు ఇలాంటి రక్షణల అవసరమే ఉండదు. దాన్ని సాకారం చేయకుండా ఈ ప్రాంతాన్ని అణ్వస్త్రాల మయం చేయటం క్షమించరాని నేరం.

నవగీతం
తెలుగు దినపత్రిక
శనివారం
25 జూలై 2026

# అర్థం కానీ జగన్ వ్యూహం

**కడప :** దేశవ్యాప్తంగా దాదాపు అన్ని రాష్ట్రాల్లోనూ కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం వర్సెస్ ఇండియా కూటమి ప్రతిపక్షాల నడుమ తీవ్రమైన రాజకీయ పోలరైజేషన్ నడుస్తోంది. నీట్ క్వశ్చన్ పేపర్ లీకేజీ వ్యవహారం నుంచి పార్లమెంట్ నిరసనల వరకు ప్రతి అంశమూ కేంద్ర వర్సెస్ విపక్షాలుగా ప్రత్యక్ష రణరంగాన్ని తలపిస్తోంది. అయితే, దేశమంతటా ఈ స్థాయిలో రాజకీయ వేడి రగులుతుంటే.. ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం చిత్రమైన రాజకీయ నిశ్శబ్దం అలముకుంది. ఏపీలో కూడా ఎన్డీఏ శ్రేణుల పాలన నడుస్తుండటం, ప్రధాన ప్రతిపక్షంగా వైయస్సార్‌సీపీ ఉండటంతో జాతీయ స్థాయి అంశాలపై ఇక్కడ కూడా రాజకీయ సెగ రావలసి ఉంది. కానీ, ఆ స్థాయి ప్రతిస్పందన ఏపీ రాజకీయాల్లో కనిపించకపోవడం పొలిటికల్ సర్కిల్స్‌లో పెద్ద ఎత్తున చర్చకు దారితీస్తోంది.రాష్ట్రంలో విపక్ష హోదాలో ఉన్న కాంగ్రెస్ పార్టీ క్షేత్రస్థాయిలో నీట్ బాధితులు, విద్యార్థుల పక్షాన నిరసన ప్రదర్శనలు చేపట్టినప్పటికీ, ఏపీలో ఆ పార్టీకి ఉన్న పరిమిత బలమైన కేడర్, ఓటు బ్యాంక్ దృష్ట్యా ఆ ఆందోళనలు అధికార పక్షంపై పెద్దగా ప్రభావం చూపలేకపోయాయి. నిజానికి, వైయస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి ఇది ఓ అరుదైన రాజకీయ అవకాశం. రాష్ట్రంలో లక్షలాది మంది నీట్ అభ్యర్థులు, యువత ఆందోళనలో ఉన్న వేళ, కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను నిలదీస్తూ గళమెత్తి ఉంటే ప్రధాన ప్రతిపక్షంగా వైయస్సార్‌సీపీకి మైలేజీ వచ్చి ఉండేది. కానీ, వైయస్సార్‌సీపీ ఈ వ్యవహారంలో ప్రత్యక్షంగా విద్యార్థి పోరాటంలోకి దూకలేకపోయింది.ఢిల్లీ వేదికగా కాంగ్రెస్ నాయకత్వం వహిస్తున్న ప్రతిపక్షాల సమరానికి జగన్ మద్దతు ఇవ్వకపోవడం వెనుక ఆయన సొంత రాజకీయ సమీకరణలు ఉన్నప్పటికీ, కనీసం స్వతంత్రంగా విద్యార్థుల హక్కుల కోసమైనా గళం విప్పకపోవడం రాజకీయ విశ్లేషకులను ఆశ్చర్యపరిచింది. కాంగ్రెస్‌తో జట్టుకట్టడం ఇష్టం



లేకపోయినా, యువత బహుళ ప్రయోజనాలతో ముడిపడి ఉన్న ఈ అంశంపై క్షేత్రస్థాయిలో తిరుగుబాటు జెండా ఎగరేసి ఉంటే వైయస్సార్‌సీపీ మళ్లీ జనామోదాన్ని పొందేందుకు అది నైతిక బలాన్ని ఇచ్చేది. కానీ, జగన్ ధైర్యంగా ముందుకు రాకపోవడం వల్ల ఏపీలో అధికార కూటమికి ఎలాంటి విపక్ష నిరసనల సెగ తగలకుండా సురక్షితంగా బయటపడే అవకాశం లభించింది. జాతీయ స్థాయిలో నడుస్తున్న ప్రతిపక్షాల వేవ్‌ను తమకు అనుకూలంగా మలుచుకోవడంలో వైయస్సార్‌సీపీ నాయకత్వం చూపుతున్న 'అతి జాగ్రత్త వైఖరి వెనుక బలమైన కారణాలు ఉన్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్డీఏ ప్రభుత్వంతో నేరుగా విభేదించడం వల్ల రాబోయే రోజుల్లో చట్టపరమైన సమస్యలు ఎదురవుతాయనే భయాలు వైయస్సార్‌సీపీ వైఖరిని నియంత్రిస్తున్నట్లు తెలుస్తోంది. గతంలో ఢిల్లీ పర్యటనల ద్వారా కేంద్రంతో సత్సంబంధాలు కొనసాగించేందుకు జగన్ యత్నించిన తీరు చూస్తే, ఆయన కేంద్ర అధికార పీఠంతో నేరుగా ఢీ కొట్టేందుకు అస్సలు సిద్ధంగా లేరని స్పష్టమవుతోంది.ఈ రక్షణాత్మక రాజకీయ ధోరణి వల్ల ప్రధానంగా నష్టపోతోంది వైయస్సార్‌సీపీ మాత్రమేనని చెబుతున్నారు. ఒక ప్రతిపక్షంగా ప్రజలు, యువత ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై వీధుల్లోకి వచ్చి పోరాడటంలో విఫలమైనప్పుడు, ఆ రాజకీయ ఖాళీని ఇతర శక్తులు పూరించే ప్రమాదం ఉంది. 2024 అసెంబ్లీ ఎన్నికల్లో ఎదురైన ఘోర పరాజయం నుంచి పార్టీ కేడర్‌ను తిరిగి సమీకరించడానికి, కొత్త ఉత్సాహాన్ని నింపడానికి నీట్ వంటి జాతీయ అంశం ఒక అద్భుతమైన రాజకీయ అస్త్రంగా ఉపయోగపడి ఉండేది. కానీ, ఆ అవకాశాన్ని వైయస్సార్‌సీపీ చేజేతులా వదులుకుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రతిపక్షం నుంచి గట్టి ప్రతిఘటన లేదా రాజకీయ నిరసనలు లేకపోవడంతో, కూటమి ప్రభుత్వం తమ పాలనాజెండాను చాలా సులువుగా అమలు చేయగలుగుతోంది. ఒకవైపు దేశమంతటా విపక్షాలు కేంద్రాన్ని కుదిపేస్తుంటే, ఏపీలో మాత్రం ఎన్డీఏ ప్రభుత్వం ఎటువంటి రాజకీయ ఇబ్బందులు లేకుండా అత్యంత కంఫర్టబుల్ జోన్‌లో కొనసాగుతోంది. జాతీయ స్థాయిలో వస్తున్న అవకాశాలను అందుకోవడంలో, ప్రజా సమస్యలపై అగ్రెసివ్ మైలేజీ సాధించడంలో వైఎస్ జగన్ అనుసరిస్తున్న ఈ వెనకడుగు వైఖరి వైయస్సార్‌సీపీ భవిష్యత్ రాజకీయాలకు ప్రతిబంధకంగా మారే అవకాశం ఉంది. ప్రతిపక్ష హోదాలో ఉంటూ కూడా కేంద్రంతో లేదా అధికార కూటమితో తలపడటానికి వెనుకాడటం వల్ల పార్టీ మద్దతుదారుల్లో తీవ్ర నిరాశ నెలకొంటోంది. రాబోయే రోజుల్లోనైనా జగన్ తన రాజకీయ శైలిని మార్చుకుని, ప్రజల్లో ఉండే సమస్యలపై పోరాట బాట పడతారా లేక ఇదే సైలెంట్ స్ట్రాటజీని కొనసాగిస్తారా అనేది చూడాల్సి ఉంది.

# లింక్డిన్‌లో వైజాగ్ టాప్

**విశాఖపట్టణం :** ఆంధ్రప్రదేశ్‌లో లెక్కలు మారుతున్నాయి.. రాష్ట్రానికి కంపెనీల రాకతో యువతకు ఉద్యోగ అవకాశాలు పెరుగుతున్నాయి. ముఖ్యంగా విశాఖపట్నానికి ఐటీ కంపెనీలతో పాటుగా డేటా సెంటర్లు, పరిశ్రమలు రావడంతో అక్కడ ఉద్యోగ అవకాశాలు పెరిగాయి. దేశవ్యాప్తంగా ఉద్యోగ అవకాశాలు వేగంగా పెరుగుతున్న నగరాల్లో విశాఖపట్నం టాప్‌లో నిలిచింది. మొన్నటి వరకు 3వ స్థానంలో ఉన్న విజయవాడ 10వ స్థానానికి పడిపోయింది.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకొచ్చి యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంపై ఫోకస్ పెట్టింది. జిల్లాల వారీగా పరిశ్రమలు, ఐటీ కంపెనీలను తీసుకొస్తోంది. ప్రస్తుతం రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరుగుతు న్నాయి.. దేశవ్యాప్తంగా ఉద్యోగ అవకాశాలు వేగంగా పెరుగుతున్న నగరాల జాబితాలో ఏపీకి స్థానం దక్కింది. ప్రొఫెషనల్ నెట్‌వర్కింగ్ సర్వీస్ లింక్డిన్ సిటీస్ ఆన్ ది రైజ్ పేరుతో విడుదల చేసిన సెకండ్ ఎడిషన్ జాబితాలో విశాఖపట్నం మొదటి స్థానంలో నిలిచింది. లుధియానా రెండో స్థానం, సూరత్ మూడో స్థానం, వడోదర నాలుగో స్థానం, ప్రయాగ్‌రాజ్ ఐదో స్థానం, రాజ్‌కోట్ ఆరో స్థానం, జబల్‌పూర్ ఏడో స్థానం, రాంచీ ఎనిమిదో స్థానం, రాయ్‌పూర్ తొమ్మిదో స్థానం, విజయవాడ పదో స్థానంలో నిలిచాయి. అయితే గతంలో మూడో స్థానంలో నిలిచిన విజయవాడ ఈసారి పదో స్థానానికి పడిపోయింది.లింక్డిన్ న్యూస్, డేటా సైంటిస్టులు రూపొందించిన ఈ ర్యాంకింగ్‌లకు సంబంధించి.. ఉద్యోగ అవకాశాలు, నియామకాలు, టాలెంట్ మైగ్రేషన్ పెరుగుతున్న అభివృద్ధి చెందుతున్న నగరాలను గుర్తిస్తున్నారు. మార్చి 2024 నుంచి ఫిబ్రవరి 2026 మధ్య కాలంలో లక్షలాది లింక్డిన్ సభ్యుల ప్రొఫైల్‌లు, ఉద్యోగ ప్రకటనల నుంచి సేకరించిన డేటా ఆధారంగా ఈ ర్యాంకింగ్స్ రూపొందించారు. గూగుల్ ఏఐ హబ్, రిలయన్స్



డేటా సెంటర్ ప్రాజెక్ట్, ఇన్ఫోసిస్, కాగ్నిజెంట్, యాక్సెంచర్ విస్తరణలతో సహా భారీ స్థాయి పెట్టుబడుల కారణంగా విశాఖపట్నానికి టాప్ ప్లేస్ దక్కింది.అంతేకాదు విశాఖపట్నం లో ఐటీ సేవలు, ఫార్మా, టెక్నాలజీ రంగాలలో ఉద్యోగ అవకా శాలు లభిస్తున్నాయి. వీటిలో డాక్టర్ రెడ్డీస్ లాబొరేటరీస్, లారస్ ల్యాబ్స్, మిరాకిల్ సాఫ్ట్‌వేర్ సిస్టమ్స్ వంటి ప్రధాన సంస్థలు ఉన్నాయి. నగరంలోని ఉద్యోగాలలో 17.1 శాతం రిమోట్ పద్ధతిలో, 5.2 శాతం హైబ్రిడ్ పద్ధతిలో ఉన్నాయి. బలమైన జాబ్ మార్కెట్, ఉద్యోగుల సంఖ్య అధికంగా ఉన్న నగరాలను లింక్డిన్ గుర్తించింది. 10 నాన్ మెట్రో నగరాలకు ర్యాంకులు కేటాయించగా.. ఇక్కడ ప్రతి పోస్టుకు దరఖాస్తుదారుల సంఖ్య రెట్టింపు కంటే ఎక్కువగా ఉందని తేలింది. దేశంలో అభివృద్ధి చెందుతున్న నగరాలు ప్రత్యేంగా, ఆయా రంగాల్లో ఉపాధి అవకాశాలు సృష్టించుకుంటున్నట్లుగా తేలింది. విశాఖలో ఐటీతో పాటుగా ఫార్మా, తయారీ రంగం, డేటా సెంటర్లు, పోర్టు వంటివి కీలకంగా మారాయి. ఇక రెండో స్థానంలో నిలిచిన లుధియానాలో ఉక్కు, విమానయానం, ఆతిథ్య రంగాల్లో ఉద్యోగ అవకాశాలు ఎక్కువగా దక్కుతున్నాయి. సూరత్ టెక్స్‌టైల్, వజ్రాలు, స్టార్టప్‌లు, రియల్ ఎస్టేట్ ద్వారా విస్తరిస్తోంది. వడోదరలో కెమికల్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, ఎంటర్‌ప్రైజ్ పెట్టుబడులు వస్తున్నాయి. విజయవాడలో కూడా ఐటీ, ఈ-గవర్నెన్స్ కంపెనీల నుంచి ఆసక్తి పెరుగుతోంది. ఈ 10 నగరాల్లోనూ తొలి మూడు నియామకాల్లో ఐటీ సేవలు, టెక్నాలజీ, కన్సల్టింగ్ సర్వీసులు ఉన్నాయి. మిగతా నగరాల్లో బ్యాంకింగ్, ఆర్థిక సేవలు ఉన్నాయని లింక్డిన్ చెబుతోంది.

# గ్రేటర్ ఎన్నికలకు కోర్టు మోకాలడ్డూ

**హైదరాబాద్ :** గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల సన్నాహాల్లో మునిగి తేలుతున్న అధికార కాంగ్రెస్ ప్రభుత్వానికి తెలంగాణ ఉన్నత న్యాయస్థానం ఊహించని షాక్ ఇచ్చింది. జీహెచ్ఎంసీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదలపై హైకోర్టు తాత్కాలిక స్టే విధించడంతో అధికార వర్గాల్లో ఒక్కసారిగా కలకలం రేగింది. వార్డుల




పునర్విభజన ప్రక్రియను చట్టబద్ధమైన నిబంధనల ప్రకారం పూర్తి చేసి, సరిహద్దులను శాస్త్రీయ పద్ధతిలో పునర్నిర్ణయించేంత వరకు ఎలాంటి ఎన్నికల ప్రక్రియను ముందుకు తీసుకెళ్లవద్దని రాష్ట్ర ప్రభుత్వంతో పాటు రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని ధర్మాసనం కఠినంగా ఆదేశించింది. రాజధాని నగరంపై పట్టు సాధిం చాలని భావిస్తున్న హస్తం పార్టీకి ఈ న్యాయపరమైన చిక్కు అతిపెద్ద రాజకీయ ఎదురుదెబ్బగా మారింది.ఈ వివాదానికి ప్రధాన మూలం ఇటీవల జీహెచ్ఎంసీ ఆదరాబాదరాగా చేపట్టిన వార్డుల విభజన ప్రక్రియలోని అవకతవకలే. మున్సిపల్ చట్టాల ప్రకారం ప్రతి వార్డు సరిహద్దు నిర్ణయం అనేది కేవలం ఆయా ప్రాంతాల జనాభా ప్రాతిపదికన, సమతుల్యత దెబ్బతినకుండా జరగాలి. కానీ, ప్రస్తుతం చేపట్టిన పునర్విభజన తెలంగాణ మున్సిపాలిటీల చట్టం 2019 లోని సెక్షన్ 6 స్ఫూర్తికి సంపూర్ణంగా విరుద్ధంగా ఉందంటూ పిటిషనర్లు కోర్టు దృష్టికి తీసుకెళ్లిన ఆధారాలు న్యాయస్థానాన్ని సంతృప్తిపరిచాయి. శాస్త్రీయ ప్రాతిపదికను పక్కనబెట్టి, కొన్ని ప్రాంతాలలో జనాభాను విపరీతంగా పెంచేసి, మరికొన్ని చోట్ల కుదించి వేయడం తీవ్రమైన అభ్యంతరాలకు దారితీసింది.ఈ పరిణామం వెనుక అధికార కాంగ్రెస్ పార్టీ రాజకీయ ప్రయోజనం వెతుక్కునే ప్రయత్నం చేసిందనే ఆరోపణలు ఇప్పుడు గట్టిగా బలపడుతున్నాయి. హైదరాబాద్ పరిధిలో సాంప్రదాయకంగా ప్రతిపక్షాలైన బిఆర్ ఎస్ , బీజేపీ , ఎంఐఎం బలంగా ఉన్న ఓటు బ్యాంకులను చెదరగొట్టేందుకే వార్డుల సరిహద్దులను తమకు అనుకూలంగా మార్చుకున్నారనే విమర్శలు క్షేత్రస్థాయి నుంచి వ్యక్తమయ్యాయి. కాంగ్రెస్‌కు ప్రయోజనం చేకూర్చేలా ఓటర్లను, ప్రాంతాలను రాత్రికి రాత్రే అటు ఇటూ మార్చడం ద్వారా ఎన్నికల మేజిక్ చేయాలని చూశారన్న వాదనలకు కోర్టు బ్రేక్ ఇవ్వడంతో ప్రతిపక్షాలకు పెద్ద రాజకీయ ఆయుధం దొరికినట్లయింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికారాన్ని ఉపయోగించి వార్డుల సరిహద్దులను మార్చడం కొత్తేమీ కాకపోయినా, చట్టపరమైన నిబంధనలను, నిబంధన పత్రాలను పూర్తిగా తొక్కిపట్టడం కాంగ్రెస్‌కు రివర్స్ కొట్టింది. ప్రజాభిప్రాయ సేకరణను మమ అనిపించి, శాస్త్రీయ సర్వేలు లేకుండా ప్రక్రియను పూర్తి చేయాలని చూడటమే హైకోర్టులో ప్రభుత్వం ఇరుకున పడటానికి కారణమైంది. ఈ స్టే ఆర్డర్ పరిణామం ప్రతిపక్షాలైన బిఆర్ఎస్, బీజేపీలకు రాజకీయంగా పెద్ద ఊరటనిచ్చింది. కాంగ్రెస్ పార్టీ తమ అధికారాన్ని దుర్వినియోగం చేస్తోందని, గెలిచే అవకాశం లేకే అక్రమ మార్గాల్లో వార్డుల విభజన చేసింది అని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లేందుకు వారికి చక్కటి అవకాశం లభించింది. హైకోర్టు తీర్పును అడ్డం పెట్టుకుని, గ్రేటర్ పరిధిలో కాంగ్రెస్ వైఫల్యాలను, అక్రమ రాజకీయ వ్యూహాలను ఎండగట్టడానికి ప్రతిపక్షాలు సన్నాహాలు చేస్తున్నాయి. ఇది నగర పరిధిలో కాంగ్రెస్ గ్రాఫ్‌ను మరింత దెబ్బతీసే ప్రమాదం లేకపోలేదు.హైదరాబాద్‌ను రాజకీయంగా తమ గుప్పిట్లోకి తీసుకోవాలని వేసిన డెలిమిటేషన్ ఎత్తుగడ కాంగ్రెస్ మెడకే చుట్టుకుంది. ఇప్పుడు కోర్టు ఆదేశాల ప్రకారం మళ్లీ మొదటి నుంచి శాస్త్రీయంగా, పారదర్శకంగా సరిహద్దుల నిర్ణయం చేపట్టాలంటే నెలల సమయం పడుతుంది. ఆలోగా ప్రతిపక్షాల విమర్శల దాడిని తట్టుకోవడం, ప్రజా క్షేత్రంలో ఎదురయ్యే వ్యతిరేకతను అధిగమించడం కాంగ్రెస్ నాయకత్వానికి పెద్ద సవాలుగా మారనుంది.

## పుష్ప బ్రిడ్జిగా స్పెషల్ ఎట్రాక్షన్

**విశాఖపట్టణం :** సోషల్ మీడియా.. అదో నిరంతర ప్రవాహం. వింతల నుంచి విశేషాల వరకూ.. యుద్ధాల నుంచి సినిమాల వరకూ.. నిత్యం ఎన్నో పోస్టులు, వేలకొద్దీ వీడియోలు.. ఇక ఇందులో ప్రకృతి గురించి, ప్రకృతి అందాల గురించి ఎన్నో విశేషాలను షేర్ చేస్తుంటారు. అలా షేర్ చేసిన ఓ వీడియో ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతోంది. చూడగానే వావ్ ఎక్కడిదీ స్పాట్ అని అనకుండా ఉండలేం.. దాని గురించి ఆరా తీసిన తర్వాత ఓసారైనా వెళ్లొద్దామని మనసు లాగడం ఖాయం. అలాంటిదే ఇప్పుడు చెప్పుకోబోయే బ్రిడ్జ్.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలంలోని మోతుగూడెంలో ఉంది ఈ వంతెన. మోతుగూడె ఫోర్‌బే డ్యామ్ బ్రిడ్జ్ అని పిలుస్తారు.లోయర్ సీలేరు హైడ్రో ఎలక్ట్రిక్ పవర్ ప్రాజెక్టులో భాగంగా మోతుగూడెం ఫోర్‌బే డ్యామ్ నిర్మించారు. చుట్టూ దట్టమైన అడవులు, కొండలు.. పచ్చదనం పరుచుకున్న వాతావరణం మధ్య ఉన్న ఈ డ్యామ్.. ప్రకృతి ప్రియులను, పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తోంది. ఈ ప్రకృతి అందాలను చూసి సినిమా డైరెక్టర్లు కూడా ఇక్కడ షూటింగ్‌లు జరుపుతుంటారు. ఇక పుష్ప సినిమా షూటింగ్ తర్వాత.. మోతుగూడెం ఫోర్ బే డ్యామ్ బ్రిడ్జ్ కాస్తా..పుష్ప బ్రిడ్జ్‌గా పేరు తెచ్చుకుంది. పుష్ప సినిమాలోని కొన్ని సీన్లను ఇక్కడ చిత్రీకరించడంతో.. సినిమాతో పాటుగా ఈ ప్రాంతం కూడా బాగా పాపులర్ అయ్యింది. అప్పటి నుంచి ఇక్కడికి వచ్చే పర్యాటకుల సంఖ్య మరింత పెరిగింది.చుట్టూ లక్కవరం అటవీ ప్రాంతం, పచ్చని కొండల మధ్య సాగే మార్గం.. ఇక్కడ స్పెషల్ అట్రాక్షన్‌గా నిలుస్తున్నాయి. ఇక కరెంట్ ఉత్పత్తి తర్వాత డొంకరాయి డ్యామ్ నుంచి పవర్ కెనాల్ ద్వారా నీరు ఈ డ్యామ్‌లోకి చేరుతుంది. ఆ సమయంలో ఈ డ్యామ్ మరింత అందాన్ని సంతరించుకుంటుంది. ఇక ఈ ఫోర్ బే డ్యామ్‌కు కొద్ది దూరంలో పొల్లూరు వాటర్ ఫాల్స్ ఉన్నాయి. దీంతో ఈ రెండింటినీ కలిపి చూసేందుకు ఎక్కువమంది పర్యాటకులు వస్తుంటారు. అయితే నీటిని విడుదల చేసిన సమయంలో అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

## 85 జూలై 24న జరగాల్సిన ఓయూ పరిధిలోని అన్ని పరీక్షలు వాయిదా

**హైదరాబాద్ :** ఉస్మానియా యూనివర్సిటీ (ఓయూ) కీలక నిర్ణయం తీసుకుంది. జూలై 24, శుక్రవారం నాడు జరగాల్సిన అన్ని పరీక్షలను వాయిదా వేస్తున్నట్లు ప్రకటించింది. విద్యార్థి సంఘాలు రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థల బంద్‌కు పిలుపునివ్వడంతో వర్సిటీ అధికారులు ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు.నీట్ యూజీ 2026 పేపర్ లీకేజీ వ్యవహారం, కేంద్ర ప్రభుత్వ విద్యా విధానాలకు వ్యతిరేకంగా ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, ఎన్ఎస్‌యూఐ, పీడీఎస్‌యూ వంటి వామపక్ష, కాంగ్రెస్ అనుబంధ విద్యార్థి సంఘాలు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో బంద్‌కు పిలుపునిచ్చాయి. ఢిల్లీలో 'ఛలో పార్లమెంటు మార్చ్' నిర్వహించిన విద్యార్థులపై పోలీసులు లాఠీచార్జ్ చేశారని ఆరోపిస్తూ, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు.ఈ నేపథ్యంలో, బంద్ కారణంగా విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకూడదనే ఉద్దేశంతో అధికారులు ముందస్తు జాగ్రత్త చర్యగా పరీక్షలను వాయిదా వేశారు. ఈ నిర్ణయం ఓయూ పరిధిలోని అన్ని అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సులకు వర్తిస్తుందని స్పష్టం చేశారు. ఇదే క్రమంలో జేఎన్‌టీయూ-హైదరాబాద్ వంటి ఇతర విద్యాసంస్థలు కూడా ముందుజాగ్రత్త చర్యలు చేపట్టాయి.పరీక్షల వాయిదాతో విద్యార్థులకు తాత్కాలికంగా ఊరట లభించినప్పటికీ, అకడమిక్ క్యాలెండర్‌పై దీని ప్రభావం పడనుంది. వాయిదా పడిన పరీక్షల తదుపరి షెడ్యూల్‌ను త్వరలోనే ప్రకటిస్తామని వర్సిటీ అధికారులు వెల్లడించారు.

## పార్టీ మార్పు వార్తలపై మల్లారెడ్డి క్లారిటీ

**హైదరాబాద్ :** రాజకీయ వర్గాల్లో గత కొద్ది రోజులుగా తన పార్టీ మార్పుపై వస్తున్న ప్రచారానికి బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి మల్లారెడ్డి చెక్ పెట్టారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పుట్టినరోజు వేడుకల్లో అత్యంత ఉత్సాహంగా పాల్గొన్న ఆయన, తాను బీఆర్ఎస్‌ను వీడి వేరే పార్టీలోకి వెళ్తున్నానంటూ వస్తున్న వార్తలన్నీ కేవలం నిరాధారమైన ప్రచారమేనని స్పష్టం చేశారు.తాను పార్టీ మారుతున్నాననే రూమర్లను నిజమని నమ్మి ఒక అభిమాని తన సొంత రక్తంతో లేఖ రాయడం తనను ఎంతగానో కలచివేసిందని మల్లారెడ్డి తెలిపారు. త్వరలోనే ఆ అభిమానిని నేరుగా కలిసి మాట్లాడతానని ఆయన హామీ ఇచ్చారు. అనంతరం కేటీఆర్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతూ... కేటీఆర్ 125 ఏళ్లు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని మనస్ఫూర్తిగా ఆశీర్వదించారు. రాబోయే రోజుల్లో తెలంగాణ రాష్ట్రానికి కేటీఆరే ముఖ్యమంత్రి కాబోతున్నారని, ఆయన్ను సీఎం పీఠంపై చూడటమే తన ప్రధాన లక్ష్యమని మల్లారెడ్డి వ్యాఖ్యానించారు.

## 20 ఏళ్లుగా అమెరికాలో ఉద్యోగం.. ఇంజినీర్‌పై తెలంగాణ ప్రభుత్వం విచారణ!

**హైదరాబాద్ :** తెలంగాణ రోడ్లు, భవనాల (ఆర్ అండ్ బి) శాఖలో పనిచేస్తున్న ఓ ఇంజనీర్, ప్రభుత్వ ముందస్తు అనుమతి లేకుండా దాదాపు రెండు దశాబ్దాలుగా అమెరికాలో ఉద్యోగం చేస్తున్నట్లు వెలుగులోకి వచ్చింది. ఈ వ్యవహారాన్ని తీవ్రంగా పరిగణించిన ప్రభుత్వం, సదరు ఇంజినీర్‌పై క్రమశిక్షణా చర్యలకు ఉపక్రమించింది. శాఖాపరమైన రికార్డుల్లో ఇప్పటికీ ఉద్యోగిగా కొనసాగుతున్న ఆయనపై సమగ్ర విచారణకు ఆదేశాలు జారీ చేసింది.ఆర్ అండ్ బి శాఖలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా ఉన్న సీహెచ్ రవి, 2006లో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా విధులు నిర్వర్తిస్తున్న సమయంలో తొలిసారిగా అమెరికా వెళ్లారు. అనంతరం 2011లో స్వల్ప కాలం పాటు తిరిగి వచ్చి, 2012లో మళ్లీ అమెరికాకు వెళ్లారు. అప్పటి నుంచి ఆయన విధులకు హాజరుకావడం లేదు. గత కొన్ని ఏళ్లుగా ఆయన వేతనం తీసుకోనప్పటికీ, ఆర్ అండ్ బి శాఖ అధికారిక రికార్డుల్లో ఆయన పేరు ఇప్పటికీ ఉద్యోగిగా కొనసాగుతుండటం గమనార్హం.ప్రభుత్వ సర్వీస్ నిబంధనల ప్రకారం, విదేశాల్లో ఉద్యోగం చేయాలంటే ప్రభుత్వం నుంచి ముందస్తు అనుమతి పొందడం తప్పనిసరి. అలాగే, నిబంధనల మేరకు గరిష్ఠంగా ఐదేళ్ల వరకు మాత్రమే దీర్ఘకాలిక సెలవు పొందేందుకు అవకాశం ఉంటుంది. అయితే, రవి ఎలాంటి అనుమతులు పొందకుండానే విదేశాల్లో ఉద్యోగంలో చేరి సేవా నిబంధనలను ఉల్లంఘించారని అధికారులు గుర్తించారు.ఈ నేపథ్యంలో, అనధికారిక గైర్హాజరు, సర్వీస్ నిబంధనల ఉల్లంఘన ఆరోపణలపై ప్రభుత్వం శాఖాపరమైన విచారణకు ఆదేశాలు జారీ చేసింది. అయితే, ఈ ఆరోపణలకు సంబంధించి రవి నుంచి ఇప్పటివరకు ఎలాంటి లిఖితపూర్వక వివరణ అందలేదని తెలుస్తోంది.

## తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలి

**కరీంనగర్ :** కరీంనగర్ లోఎల్ నినో ప్రభావంతో జిల్లాలో ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా ఆదేశించారు. మిషన్ భగీరథతో పాటు ఇతర తాగునీటి సరఫరా వ్యవస్థల్లో ఎలాంటి అంతరాయం కలగకుండా సమన్వయంతో పనిచేయాలని సూచించారు.శుక్రవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, మిషన్ భగీరథ, పబ్లిక్ హెల్త్ అధికారులతో తాగునీటి సరఫరాపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నగరపాలక సంస్థలు, మున్సిపాలిటీల పరిధిలో రోజువారీ నీటి అవసరాలు, సరఫరా పరిస్థితులు, నీటి పొదుపు కోసం చేపడుతున్న చర్యలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఎక్కడైనా తాగునీటి పైపులైన్లకు లీకేజీలు ఏర్పడితే వెంటనే మరమ్మతులు చేపట్టి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆదేశించారు. వార్డుల వారీగా పనిచేస్తున్న బోర్లు, వినియోగంలో లేని బోర్లను గుర్తించి అవసరమైన మరమ్మతులు చేసి తిరిగి వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు.కార్పొరేషన్ పరిధిలోని కొత్తపల్లి-ఎలగందుల, బొమ్మకల్, విద్యారణ్యపురి, అలుగునూరు, చింతకుంట ప్రాంతాలతో పాటు ఇటీవల విలీనమైన గ్రామాల్లో తాగునీటి సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ పేర్కొన్నారు. అలాగే జమ్మికుంట, హుజురాబాద్, చొప్పదండి మున్సిపాలిటీలు, గంగాధర, గన్నేరువరం మండలాల్లో నీటి అవసరాలు, వినియోగం, సరఫరా పరిస్థితులను సమీక్షించారు.ఎల్ఎండీ రిజర్వాయర్‌లో నీటి నిల్వలను ప్రతిరోజూ పర్యవేక్షించాలని, డెడ్ స్టోరేజ్ పరిస్థితి ఏర్పడకముందే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. గన్నేరువరం మండలంలోని హనుమాజిపల్లి జంగంపల్లి ప్రాంతాల్లో నెలకొన్న తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని సూచించారు.

# భూ భారతి రీ-సర్వే ద్వారా భూముల హక్కులకు శాశ్వత భద్రత : జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్

**రైతులు పూర్తి సహకారం అందించాలి**

**సంగెం గ్రామంలో భూ భారతి రీ-సర్వే అవగాహన సదస్సు**





**నవగీతం, జగిత్యాల/కోరుట్ల** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన భూ భారతి రీ-సర్వే కార్యక్రమం శుక్రవారం కోరుట్ల మండలం సంగెం గ్రామంలోని సంగమేశ్వర ఫంక్షన్ హాల్ లో అవగాహన సదస్సు నిర్వహించగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ .. రీ-సర్వే ద్వారా గ్రామంలోని అన్ని భూములను శాస్త్రీయ పద్ధతిలో కొలిచి, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కొత్త మ్యాపులను రూపొందించడం జరుగుతుందని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, రైతులు చురుకుగా పాల్గొని సర్వే బృందానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. భూ భారతి రీ-సర్వేలో భాగంగా ముందుగా గ్రామ సరిహద్దు ను శాశ్వతంగా నిర్ధారిస్తారు. అనంతరం గ్రామ కంఠం (ఇళ్ల విస్తీర్ణం ఉన్న ప్రాంతం)లోని ప్రతి ఇంటిని ఆధునిక సర్వే పరికరాల ద్వారా మళ్లీ కొలిచి పాయింట్లు నమోదు చేసి, గ్రామంలోని ఇళ్ల సరిహద్దులను ఖరారు చేస్తారు. తదుపరి దశలో ప్రభుత్వ భూముల సరిహద్దులను గుర్తించి సర్వే నిర్వహిస్తారు. ఇందులో ప్రభుత్వానికి చెందిన చెరువులు, కాలువలు, రహదారులు, ప్రభుత్వ స్థలాలు, పోరంబోకు భూములు మరియు ఇతర ప్రభుత్వ ఆస్తులన్నింటినీ ఖచ్చితంగా మ్యాపింగ్ చేసి నమోదు చేస్తారు. గ్రామ సరిహద్దు, గ్రామ కంఠం, ప్రభుత్వ భూముల సర్వే పూర్తయిన తర్వాత పట్టా భూముల రీ-సర్వే ప్రారంభమవుతుంది. ఇందుకోసం ప్రతి రైతుకు భూ భారతి చట్టం ప్రకారం 9(1) నోటీసు జారీ చేసి ముందస్తు సమాచారం అందజేస్తారు. నోటీసులో పేర్కొన్న తేదీ, సమయానికి రైతులు తప్పనిసరిగా తమ భూమి వద్ద హాజరుకావాలని సూచించారు. సర్వే సమయంలో రైతు ప్రస్తుతం అనుభవిస్తున్న (ఎంజాయ్మెంట్‌లో ఉన్న) భూమి ఆకృతి, హద్దులు, మూలల పాయింట్లు, భూమి యొక్క వాస్తవ స్థితిని ఆధునిక సర్వే పరికరాల సహాయంతో నమోదు చేసి, ఖచ్చితమైన కో-ఆర్డినేట్లతో కొత్త డిజిటల్ మ్యాపులు రూపొందిస్తారు. రైతులు గ్రామ సరిహద్దు నిర్ణయించే సమయంలో, తమ భూముల సర్వే నిర్వహించే సమయంలో తప్పనిసరిగా అక్కడే ఉండి, తమ భూమి హద్దులను స్పష్టంగా చూపించి సర్వే బృందానికి పూర్తి సహకారం అందించాలని అధికారులు కోరారు. ప్రజల సహకారంతోనే భూ భారతి రీ-సర్వే కార్యక్రమం పారదర్శకంగా, వేగవంతంగా పూర్తవుతుందని తెలిపారు. ఈ అవగాహన సదస్సుకు గ్రామ ప్రజలు, రైతులు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరై భూ భారతి రీ-సర్వేపై పూర్తి అవగాహన పొందాలని విజ్ఞప్తి చేశారు. భూములపై భవిష్యత్తులో తలెత్తే వివాదాలను నివారించి, ప్రతి భూయజమానికి స్పష్టమైన హక్కులు కల్పించే ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి అందరూ సహకరించాలని కోరారు. సంగెం గ్రామంలో పంచాయతీ భవనం, వివో భవనం, డ్రైనేజీ ల నిర్మాణం కొరకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని తెలిపారు. గ్రామంలో నిర్మాణంలో ఉన్న వివో భవనాన్ని పరిశీలించి పూర్తి స్థాయిలో నిర్మాణం పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. అనంతరం గ్రామంలో మొక్కను నాటారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల రెవెన్యూ డివిజనల్ అధికారి జీవాకర్ రెడ్డి, తహసీల్దార్ కృష్ణ చైతన్య, ఎంపిడివో, రెవెన్యూ అధికారులు, సర్వేయర్ కుమారస్వామి, గ్రామ సర్పంచ్, వార్డు సభ్యులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు మరియు తదితరులు పాల్గొన్నారు.

# 1/70 చట్టాన్ని బలహీనపరిస్తే ఆదివాసుల ఆగ్రహ జ్వాలలు తప్పవు.

**జీవో నంబర్ 3 ను వెంటనే పునరుద్ధరించాలి .**

**రాజ్యాంగ హక్కుల పరిరక్షణకు తుడుందెబ్బ పోరాట శంఖారావం**

**ఆగస్టు 17న ఎమ్మార్వోలు, ఎమ్మెల్యేలకు మెమోరాండాలు**




**నవగీతం,(ములుగు జిల్లా ప్రతినిధి):** ఆదివాసి హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ ములుగు జిల్లా కమిటీ సమావేశం జిల్లా అధ్యక్షులు చంద మహేష్ అధ్యక్షతనఏటూరు నాగారం లో ఘనంగా జరిగింది. ఈ సమావేశానికి జాతీయ ప్రధాన కార్యదర్శి రమణాల లక్ష్మయ్య, జాతీయ ఉపాధ్యక్షులు పొడెం రత్నం, యాసం రాజు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కబ్బాక శ్రావణ్, రాష్ట్ర కార్యదర్శులు వట్టం జనార్ధన్, చింత కృష్ణ ముఖ్య అతిథులుగా హాజరై ఆదివాసీల భూహక్కులు, రాజ్యాంగ హక్కులు, షెడ్యూల్డ్ ఏరియా రక్షణపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ఏజెన్సీ ప్రాంతాల్లో ఆదివాసీల భూములు, అటవీ హక్కులు, రాజ్యాంగబద్ధమైన రక్షణలను కాపాడే 1/70 చట్టాన్ని నిర్వీర్యం చేసే కుట్రలు జరుగుతున్నాయని తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. 1/70 చట్టంపై ఎలాంటి దాడి జరిగినా తుడుందెబ్బ రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలతో ప్రభుత్వాన్ని నిలదీస్తుందని హెచ్చరించారు. అదేవిధంగా, ఆదివాసీల హక్కుల పరిరక్షణకు కీలకమైన 3 జీవో ను ప్రభుత్వం తక్షణమే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఐదో షెడ్యూల్ ప్రాంతాల్లో రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాయడం సహించబోమని, ఆదివాసీల భూములు, అడవులు, సహజ వనరులను కాపాడేందుకు తుడుందెబ్బ ఉద్యమం మరింత ఉధృతం కానుందని స్పష్టం చేశారు. సమావేశంలో తీసుకున్న కీలక నిర్ణయాలు. ఇలా ఉన్నాయి. ఆగస్టు 6న తుడుందెబ్బ ఆవిర్భావ దినోత్సవాన్ని ప్రతి గ్రామం, ప్రతి మండలంలో తుడుందెబ్బ జెండా ఆవిష్కరణతో ఘనంగా నిర్వహించాలని నిర్ణయించారు.

ఆగస్టు 9 ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ఆదివాసీ చట్టాలను ఉల్లంఘిస్తున్న ప్రభుత్వాల వైఖరిని నిరసిస్తూ రాష్ట్రవ్యాప్తంగా నల్ల బ్యాడ్జీలు, నల్ల టోపీలు, నల్ల టీ-షర్టులు ధరించి భారీ నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని తీర్మానించారు. ఆగస్టు 17న రాష్ట్రవ్యాప్తంగా ప్రతి మండల తహసిల్దార్లకు వినతి పత్రాలు సమర్పించాలి . ఆగస్టు 22, నుండి సెప్టెంబర్ 5వ తేదీ వరకు ,ఏజెన్సీ ప్రాంత శాసనసభ నియోజకవర్గ ఎమ్మెల్యేలకు, రాష్ట్రంలో ఉన్న మన్ననూరు, ఉట్నూరు, ఏటూరు నాగారం, భద్రాచలం ఐటీడిఏ ప్రాజెక్ట్ ఆఫీసర్లకు , జిల్లా కలెక్టర్లకు ఆదివాసీ గిరిజన సమస్యలు, 1/70 చట్ట పరిరక్షణ, 3 జీవోను పునరుద్ధరణ, భూహక్కుల అమలు, అటవీ హక్కుల రక్షణ తదితర అంశాలపై సమగ్ర మెమోరాండాలు సమర్పించాలని నిర్ణయించారు. నాయకులు మాట్లాడుతూ, గిరిజనేతరులు వన్ బై సెవెన్ పై ఆదివాసీ ప్రాంతాల్లో 100% సర్పంచులకు ఏ విధంగా సర్పంచులను ఎన్నిక చేస్తారని సుప్రీంకోర్టులో కేసు వేయడం జరిగిందనీ, ఈ సమస్య పైన తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఆదిలాబాద్ వరంగల్ ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఆదివాసి సంఘాలను ఐక్యం గా ఏర్పాటు చేసి పెద్ద ఎత్తున కార్యక్రమాలు నిర్వహించాలని ఆదివాసులకు పిలుపునిస్తూ,ఆదివాసీ చట్టాలు,హక్కులను కాలరాసే ప్రభుత్వాలకు తుడుందెబ్బ ఉద్యమమే సమాధానం ఇస్తుందని, రాజ్యాంగం ప్రసాదించిన హక్కులను కాపాడే వరకు ఉద్యమం ఆగదని స్పష్టం చేశారు. అవసరమైతే రాష్ట్రవ్యాప్తంగా పెద్దఎత్తున ఆందోళనలు, ధర్నాలు, రాస్తారోకోలు, చలో కార్యక్రమాలు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వట్టం సురేష్, మాజీ ప్రధాన కార్యదర్శి కాపుల సమ్మయ్య, ఉపాధ్యక్షులు సిద్దబోయిన సర్వేశ్వరావు, కుచ్చింటి చిరంజీవి, లాయర్ చింత సమ్మయ్య, చింత సోమరాజు, వాసం శ్రావణ్, కోట సంపత్, పొడెం నర్సింగరావు, విజయ్, బిక్షపతి, ఏటూరునాగారం మండల అధ్యక్షులు తాటి నీలాద్రి, గోవిందరావుపేట మండల అధ్యక్షుడు గొంది కిరణ్, తాడ్వాయి మండల అధ్యక్షుడు చంద నవీన్, ఆలం రాంబాబు, వెంకటాపురం మండల అధ్యక్షుడు కనితి వెంకటకృష్ణతో పాటు జిల్లా, మండల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జర్నలిస్టు ఉద్యమకారుల సంక్షేమానికి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి.

**ప్రజా ప్రభుత్వం కాలయాపన చేయకుండా వెంటనే చర్యలు చేపట్టాలి.**

**జెఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షులు తక్కెళ్ళపల్లి శ్రీనివాస్.**



**నవగీతం,హైదరాబాద్:** తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ (జీవో నెం. 679) షెడ్యూల్‌లో భాగంగా అమరవీరుల స్మారక చిహ్నం (అమరదీపం) వద్ద జర్నలిస్ట్స్ సంక్షేమ సంఘం (జెఎస్ఎస్) వ్యవస్థాపక అధ్యక్షులు చీకట్ల శ్రీనివాస్, జాతీయ అధ్యక్షులు మానసాని కృష్ణారెడ్డిల ఆదేశానుసారం రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు తక్కెళ్ళపల్లి శ్రీనివాస్, డాక్టర్ కానుగంటి రాజుల ఆధ్వర్యంలో కమిటీ చైర్మన్ డాక్టర్ కె. కేశవరావు, ఎమ్మెల్సీలు ప్రొఫెసర్ ఎమ్. కోదండరామ్, ఎగ్జిక్యూటివ్ సభ్యులు మోతె శోభన్ రెడ్డి, ఎస్. రాములు నాయక్ లను కలిసి తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న జర్నలిస్టుల సంక్షేమం కోసం వినతిపత్రం ఇవ్వడం జరిగింది.

**ప్రధాన డిమాండ్లు:**

తెలంగాణ మీడియా చానల్స్, పత్రికల రక్షణ కొరకు ప్రభుత్వం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి నిధులు కేటాయించాలనీ, జర్నలిస్టులగా గుర్తింపు పొందిన ప్రతి ఒక్కరికి 250 గజాల నివాస స్థలంలో ఇల్లు నిర్మించి ఇవ్వడంతో పాటు, ఉచిత రవాణా సౌకర్యం, పిల్లలకు ఉచిత నాణ్యమైన విద్య, కార్పొరేట్ ఆసుపత్రులలో జర్నలిస్టుల కుటుంబ ఆరోగ్య రక్షణ కొరకు ప్రత్యేక సదుపాయం, అర్హులైన జర్నలిస్టులకు పెద్ద మధ్య చిన్న పత్రికలు అనే తేడా లేకుండా అక్రిడేషన్ కార్డులు ఇవ్వాలనే డిమాండ్లను చేర్చడం జరిగింది. ఈ ప్రక్రియ మొత్తాన్ని ప్రజా ప్రభుత్వం కాలయాపన చేయకుండా వెంటనే చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేయడం జరిగింది.

**కమిటీ భరోసా:**

ఈ సందర్భంగా కమిటీ సభ్యులు కోదండ రామ్, రాములు నాయక్ మాట్లాడుతూ.. జర్నలిస్టులు ఉద్యమంలో చురుగ్గా పాల్గొని రాష్ట్రాన్ని సాధించారని, వారి ప్రతి డిమాండ్ అత్యంత సమంజసమైనదని పేర్కొన్నారు. డిజిటల్ విధానంలో రికార్డ్ చేసిన ఆధారాల ద్వారా ఏ ఒక్కరికీ అన్యాయం జరగకుండా చూస్తామని, విజ్ఞప్తులన్నింటినీ క్రోడీకరించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి, సమాచార కమిషనర్ ముకుంద రెడ్డి లకు నివేదిస్తామని స్పష్టం చేశారు. కమిటీని కలిసిన వారిలో జెఎస్ఎస్ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు కడారి బాలేశం, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రాజశేఖర్, ప్రసాద్ రాజులు పాల్గొన్నారు.

## విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసిన ఎంపీడీఓ

**భోజన నాణ్యతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచన**



**నవగీతం,(భీంగల్ ప్రతినిధి):** భీంగల్ మండలం పురాణపేట గ్రామ ప్రాథమిక పాఠశాలను ఎంపీడీఓ గంగుల సంతోష్ కుమార్ శుక్రవారం సందర్శించి విద్యార్థుల బోధన, అభ్యాస పరిస్థితులను పరిశీలించారు. తరగతి గదులను సందర్శించి విద్యార్థులతో మాట్లాడి వారి విద్యా పురోగతిపై ఆరా తీశారు. అనంతరం పాఠశాలలో అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. భోజనం నాణ్యత, పరిశుభ్రత విషయంలో ఎలాంటి రాజీ పడకుండా విద్యార్థులకు పోషకాహారంతో కూడిన భోజనం అందించాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన విధంగా వారానికి మూడు రోజుల పాటు గుడ్డు తప్పనిసరిగా అందజేయాలని ఆదేశించారు. పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పోషకాహారం అందించడం అత్యంత ముఖ్యమని ఎంపీడీఓ పేర్కొన్నారు. విద్యార్థుల ఆరోగ్యం, చదువులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఉపాధ్యాయులు, సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బుర్ర సుమ, దేవేందర్ గౌడ్, ఏపీఓ నర్సయ్య, గ్రామ సర్పంచ్ సుమ, ఇన్చార్జి హెచ్ఎం సౌజన్య, పంచాయతీ కార్యదర్శి మాలేపు అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

## పేదంగంటి ఎల్లమ్మ ఆలయ అభివృద్ధికి కీలక హామీ

**భక్తులకు మెరుగైన సౌకర్యాల కొరకు కృషి చేస్తానన్న ముత్యాల సునీల్ కుమార్**



**నవగీతం,(భీంగల్ ప్రతినిధి ):** భీంగల్ మండలం బడా భీమ్ గల్ గ్రామంలోని ప్రసిద్ధ ఎల్లమ్మ ఆలయ అభివృద్ధికి సహకారం అందించాలని వీడీసీ (విలేజ్ డెవలప్మెంట్ కమిటీ) ప్రతినిధులు బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ముత్యాల సునీల్ కుమార్ ని కలిసి వినతిపత్రం అందజేశారు. ఆలయానికి రోజురోజుకూ భక్తుల రద్దీ పెరుగుతున్న నేపథ్యంలో తాగునీటి కోసం పైప్లైన్ ఏర్పాటు చేయాలని, ఆలయం వరకు విద్యుత్ సౌకర్యం కల్పించాలని వీడీసీ ప్రతినిధులు కోరారు. భక్తులకు మెరుగైన మౌలిక వసతులు కల్పిస్తే ఆలయానికి వచ్చే వారికి మరింత సౌకర్యంగా ఉంటుందని వివరించారు.

వినతిపై సానుకూలంగా స్పందించిన ముత్యాల సునీల్ కుమార్, ఆలయ అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. సంబంధిత అధికారులతో మాట్లాడి అవసరమైన చర్యలు తీసుకునేలా కృషి చేస్తానని పేర్కొన్నట్లు వీడీసీ అధ్యక్షుడు పిట్ల శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వీడీసీ ఉపాధ్యక్షుడు రాగుల గంగా మోహన్, సతీష్, సుమన్,శ్రీధర్ గౌడ్, అరుణ్,భూమేశ్వర్, నాగరాజ్, శ్రీను, నందు తదితరులు పాల్గొన్నారు.

## రైతుల సంక్షేమమే ధ్యేయంగా నూతన పాలకవర్గం పనిచేస్తుంది: ఇప్ప శ్రీనివాస్ రెడ్డి



**నవగీతం, చొప్పదండి** చొప్పదండి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (ప్యాక్స్) లో నూతనంగా ఏర్పడిన కమిటీ సభ్యులందరి పరిచయం కార్యక్రమం అనంతరం సహకార సంఘం అధ్యక్షులు ఇప్ప శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన మొదటి సర్వ సభ్య సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం విండో చైర్మన్ ఇప్ప శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ

రైతుల సంక్షేమమే ధ్యేయంగా నూతన పాలకవర్గం పనిచేస్తుందని రైతులకు అందే ఎరువులు, విత్తనాలు, పంట ఋణాల పంపిణీని మరింత సులభతరం చేయడంపై ప్రత్యేక దృష్టి సారిస్తూ రైతులకు జవాబుదారీగా ఉంటామని, రైతులు పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా ఎలాంటి రాజకీయ పక్షపాతం లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పరంగా అందే పథకాలు, రుణాలను పారదర్శకంగా అందించి సంఘాన్ని దేశానికే ఆదర్శంగా నిలబెడతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమం లో వైస్ చైర్మన్ నిజానపురం చందు, డైరెక్టర్లు మారు తిరుపతి రెడ్డి, కొట్టే చందు, తాళ్ళపెల్లి పద్మ, లింగంపల్లి దేవదాస్, గంకిడి కృష్ణారెడ్డి, పెద్దిరెడ్డి గణపతి రెడ్డి, పూదరి సత్యం, గాండ్ల రాజయ్య, కుర్ర రాజయ్య, భక్తు లక్ష్మి, సొసైటీ కార్యదర్శి కళ్లెం తిరుపతి రెడ్డి, సొసైటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# ఎల్ నినో ప్రభావం..రైతులకు ముప్పు తప్పదా.?

**నవగీతం, భీంగల్ ప్రతినిధి:** ఎల్ నినో ప్రభావంతో దేశవ్యాప్తంగా వాతావరణ పరిస్థితులు ఆందోళనకరంగా మారుతున్నాయి. సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికే భీమ్గల్ మండలంలో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే తాగునీటి సమస్యతో పాటు వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొనే ప్రమాదం ఉందని అధికారులు, నిపుణులు సూచిస్తున్నారు. సూపర్ ఎల్నినో ప్రభావంతో వర్షాలు ఆలస్యంగా కురవడం, కురిసినా తక్కువ రోజులు మాత్రమే కురవడం, కొన్ని ప్రాంతాల్లో వర్షాభావ పరిస్థితులు నెలకొనే అవకాశం ఉంది. దీనివల్ల భూగర్భజలాలు మరింత దిగజారి, చెరువులు, కుంటలు, బోర్లు ఎండి పోయే పరిస్థితులు ఏర్పడే ప్రమాదం ఉంది. వ్యవసాయం, పశుసంవర్ధక రంగాలపై కూడా తీవ్ర ప్రభావం పడే అవ కాశం ఉందని చెబుతున్నారు. ఈ పరిస్థితులను ఎదుర్కోవా లంటే ఇప్పటి నుంచే నీటి సంరక్షణ చర్యలు చేపట్టాలని నిపుణులు సూచిస్తున్నారు. ముఖ్యంగా భీంగల్ మండలంలోని ప్రతి గ్రామంలో, ప్రతి ఇంటి వద్ద, ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, వ్యవసాయ క్షేత్రాల్లో ఇంకుడు గుంతలు నిర్మించడం అత్యంత అవసరం వర్షం కురిసిన ప్రతి చుక్క నీటిని భూమిలోకి ఇంకేలా చేస్తే భూగర్భ జలాలు పెరిగి భవిష్యత్తులో నీటి కొరతను కొంతవరకు నివారిం చవచ్చు. వ్యవసాయంలో కూడా మార్పులు అవసరమని వ్యవసాయ నిపుణులు సూచిస్తున్నారు. అధిక నీరు అవసం "మయ్యే పంటలకు బదులుగా చిరుధాన్యాలు, పప్పుధాన్యాలు, నూనెగింజలు వంటి అరుతడి పంటలను సాగు చేస్తే నీటి వినియోగం తగ్గడమే కాకుండా కరువు ప్రభావాన్ని కూడా అధిగమించే అవకాశం ఉంటుంది. చెరువులు, కుంటలు, కాలువలు, వాగులను పునరుద్ధరించడం, ఇళ్లపై పడే వర్షపు నీటిని రూఫ్ టాప్ రైన్వాటర్ హార్వెస్టింగ్ ద్వారా భూమిలోకి పంపించే ఏర్పాట్లు చేయడం అత్యవసరం. నీటి సంరక్షణను ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా తీసుకోవాల్సిన అవసరం ఉంది. పర్యావరణ పరిరక్షణ కూడా నీటి భద్రతకు కీలకం. విస్తృతంగా మొక్కలు నాటి వాటిని సంరక్షించడం ద్వారా ఉష్ణోగ్రతలు తగ్గడంతో పాటు వర్షాలకు అనుకూల వాతావరణం ఏర్పడుతుంది. పచ్చదనం పెంపు భవిష్యత్ తరాలకు రక్షణ కవచంగా నిలుస్తుంది. నిపుణుల హెచ్చరిక ఒక్కటే... ఇప్పుడే మేల్కొని ఇంకుడు గుంతలు నిర్మించడం,



వర్షపు నీటిని సంరక్షించడం, మొక్కలు నాటడం, నీటి వినియోగంలో పొదుపు పాటించడం, ఆరుతడి పంటల సాగుకు ప్రాధాన్యత ఇవ్వడం వంటి చర్యలు చేపట్టకపోతే రానున్న సంవత్సరాల్లో భీంగల్ మండలంతో పాటు రాష్ట్రంలోని అనేక ప్రాంతాలు తీవ్ర కరువు, తాగునీటి సంక్షోభం, వ్యవసాయ నష్టాలను ఎదుర్కొనే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు..

# విద్యుత్ ఉచ్చుకు బలైన అరుదైన ఎలుగుబంటి.. ముగ్గురు వేటగాళ్ల అరెస్ట్!

**లోకారం అడవుల్లో ఘోరం: నిమిషాల్లో కేసు ఛేదించిన అటవీ శాఖ అధికారులు**

**వన్యప్రాణులను హానిచేస్తే కఠిన చర్యలు: తల్లాడ అటవీ శాఖ హెచ్చరిక**



**నవగీతం,తల్లాడ:** తల్లాడ అటవీ ప్రాంత పరిధిలోని లోకారం రక్షిత అటవీ విభాగంలో అత్యంత అరుదైన, రక్షిత జాతికి చెందిన ఎలుగుబంటి విద్యుత్ షాక్‌కు గురై ప్రాణాలు కోల్పోయింది. అందిన ముందస్తు సమాచారం ప్రకారం జూలై 23న అటవీ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించగా, మృతి చెందిన ఎలుగుబంటి లభ్యమైంది. ఆ పరిసరాల్లోని వెదురు పొదల్లో అక్రమ వేటకు ఉపయోగించిన రెండు కిలోలకు పైగా ఇనుప తీగలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు.?సంఘటనా స్థలానికి చేరుకున్న కల్లూరు ప్రభుత్వ పశువైద్యాధికారి మృతదేహానికి శవపరీక్ష నిర్వహించారు. అడవి గుండా వెళ్లే విద్యుత్ మార్గాల నుండి అక్రమంగా విద్యుత్ సరఫరాను వాడుకుని వేటగాళ్లు అమర్చిన తీగల వల్లే ఈ ఘోరం జరిగిందని శవపరీక్ష నివేదికలో స్పష్టమైంది.

?నిందితుల అరెస్ట్ -- న్యాయస్థానానికి తరలింపు

?ఈ ఘటనపై అటవీ శాఖ అధికారులు అత్యంత వేగంగా స్పందించి దర్యాప్తును వేగవంతం చేశారు. నేరానికి పాల్పడిన ముగ్గురు నిందితులను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. నిందితులపై వన్యప్రాణి సంరక్షణ చట్టం 1972 మరియు ఇతర కఠిన నిబంధనల కింద కేసులు నమోదు చేసి సత్తుపల్లి న్యాయస్థానంలో హాజరుపరిచారు.

?వన్యప్రాణుల సంరక్షణ తమ ప్రథమ కర్తవ్యమని, విద్యుత్ తీగలు అమర్చడం, విషప్రయోగం లేదా ఉచ్చులు పన్నడం వంటి అక్రమ చర్యలకు పాల్పడితే చట్ట ప్రకారం కఠినంగా శిక్షిస్తామని తల్లాడ అటవీ అధికారులు హెచ్చరించారు. అటవీ ప్రాంతాల్లో ఎలాంటి అనుమానాస్పద కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే అధికారులకు సమాచారం అందించి రక్షణలో భాగస్వాములు కావాలని ప్రజలను కోరారు.


## జలసిరి నీటి సంరక్షణ పనులకు భూమిపూజ



**నవగీతం ,కొడిమ్యాల:** కొడిమ్యాల గ్రామంలో జలసిరి--నీటి సంరక్షణ కార్యక్రమంలో భాగంగా గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు శుక్రవారం భూమిపూజ నిర్వహించారు.గ్రామపంచాయతీ ఆవరణలో కమ్యూనిటీ ఇంకుడు గుంత, బోర్‌వెల్ రీఛార్జ్ స్ట్రక్చర్, దూలగుట్ట వద్ద వాటర్ స్టోరేజ్ ఫండ్ పనులకు ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ గుర్రం నరసయ్య గౌడ్, ఎంపీడీవో, డీఆర్‌డీవో రఘువరన్, జిల్లా టెక్నికల్ టీమ్ సభ్యుడు మనోజ్, ఏపీఓ, టెక్నికల్ అసిస్టెంట్ కొండు శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి రాధా, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు. జల వనరుల సంరక్షణకు ఈ పనులు దోహదపడతాయని అధికారులు తెలిపారు.

## స్వయం ఉపాధితో యువత ఆర్థికంగా ఎదగాలి

వైరా వైస్ చైర్మన్ కట్ల సంతోష్



**నవగీతం: వైరా ప్రతినిధి** వైరా: వైరా మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డులో రిలయన్స్ ట్రెండ్స్ పక్కన నూతనంగా ఏర్పాటు చేసిన కేఫ్ డిలైట్ హోటల్‌ను వైరా మున్సిపల్ వైస్ చైర్మన్ కట్ల సంతోష్ శుభారంభం చేశారు. రిబ్బన్ కట్ చేసి, ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం హోటల్‌ను ప్రారంభించి యాజమాన్యానికి శు భాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా కట్ల సంతోష్ మాట్లాడుతూ, మారుతున్న కాలానికి అనుగుణంగా యువత ప్రభుత్వ ఉద్యోగాలపైనే ఆధారపడకుండా స్వయం ఉపాధి రంగంలోకి అడుగుపెట్టి ఆర్థికంగా ఎదగాలని సూచించారు. చిన్న స్థాయిలో ప్రారంభించిన వ్యాపారాలను క్రమశిక్షణ, నాణ్యత, వినియోగదారుల విశ్వాసంతో ముందుకు తీసుకెళితే అవి పెద్ద సంస్థలుగా ఎదిగే అవకాశం ఉంటుందని అన్నారు. వ్యాపారంలో విజయం సాధించాలంటే నిబద్ధత, నిజాయితీ, సేవాభావం ఎంతో అవసరమని పేర్కొన్నారు. వైరా పట్టణంలో కొత్త వ్యాపార సంస్థలు ఏర్పడడం స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు పట్టణ ఆర్థికాభివృద్ధికి కూడా దోహదపడుతుందని ఆయన అన్నారు. వినియోగదారులకు పరిశుభ్రమైన వాతావరణంలో నాణ్యమైన ఆహారాన్ని అందిస్తూ మంచి పేరు సంపాదించాలని హోటల్ యాజమాన్యానికి సూచించారు. కేఫ్ డిలైట్ హోటల్ ప్రారంభం సందర్భంగా స్థానిక స్నేహితులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానికులు పాల్గొని యాజమాన్యానికి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో దమ్మాలపాటి రమేష్, బొల్లినేని రామారావు, తూము కోటేశ్వరరావు, బోడెపూడి శివయ్య, డిలిట్ హోం కేఫ్ నిర్వాహకులు శీలం రాజకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## భూనిర్వాసితులకు హెచ్ఎండిఏ లేఅవుట్ ప్లాట్లు కేటాయింపు

లాటరీ విధానంలో పంపిణీ చేసిన షాబాద్ తహశీల్దార్ ఎం డి అన్వర్



**నవగీతం,షాబాద్ ప్రతినిధి:** షాబాద్ గ్రామ రెవెన్యూ సర్వే నెం. 311 లోని భూమి కోల్పోయిన రైతులకు ప్లాట్ల కేటాయింపు లాటరీ కార్యక్రమం శుక్రవారం మధ్యాహ్నం షాబాద్ ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎండిఏ అధికారులు,మండల తహశీల్దార్ ఎం డి అన్వర్, డిప్యూటీ తహశీల్దార్ అర్హులైన రైతులకు పారదర్శకంగా లాటరీ విధానంలో ప్లాట్లను పంపిణీ చేశారు.ప్లాట్ల కేటాయింపు ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా, అర్హులైన ప్రతి రైతుకు ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల మేరకు ప్లాట్లు అందించామని అధికారులు వెల్లడించారు.లాటరీ అనంతరం కేటాయించిన ప్లాట్ల రిజిస్ట్రేషన్ కార్యక్రమం తర్వాత తెలియజేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ లు గుండాల అశోక్, కుమ్మరి చెన్నయ్య,పోనేమోని శ్రీశైలం కుమ్మరి గూడ, షాబాద్ రైతులు పాల్గొన్నారు.

## కళాశాలల బంద్ విజయవంతం




**నవగీతం (రాయికల్ ప్రతినిధి):** కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా నిర్వహించిన నీట్ పరీక్ష ప్రశ్నాపత్రాల లీకేజీని నిరసిస్తూ ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ధర్నా చేస్తున్న విద్యార్థులపై పోలీసుల లాఠీ చార్జ్ లతో గాయపడిన విద్యార్థులకు మద్దతుగా, కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా శు క్రవారం ఎన్ఎస్ యు ఐ,యూత్ కాంగ్రెస్ బందు పిలుపుమేరకు రాయికల్ పట్టణంలోని జూనియర్ కళాశాలల బందు విజయవంతమైంది.ఈ సందర్భంగా మాట్లాడుతూ నీట్ పేపర్ లీకేజ్ కి కారకులైన వారిపై అదేవిధంగా లీకేజ్ గా నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర రాజీనామా రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఢిల్లీ కేంద్రంగా విద్యార్థులు జంతర్ మంతర్లో ధర్నా చేస్తుంటే విద్యార్థులపై పోలీసులు లాఠీ చార్జ్ చేయడం అత్యంత దారుణమని బాధను వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు వాసం రాజేందర్,మున్సిపల్ కౌన్సిలర్ పల్లికొండ గంగాధర్,కాంగ్రెస్ నాయకులు అల్లే పురుషోత్తం, సుధ వేణి మురళి గౌడ్, అనుమండ్ల తేజ,కాశ వేణి రాజేష్,గట్టు నవీన్,పడిగెల నరసింహ,కొత్తపెల్లి అరవింద్, శ్రీరాముల సాయి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## జగిత్యాల జిల్లాలో తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య పర్యటన వివరాలు

**నవగీతం, జగిత్యాల** తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య శనివారం (జూలై 25) జగిత్యాల జిల్లాలో పర్యటించనున్నారు.

పర్యటనలో భాగంగా ఉదయం హైదరాబాద్‌లోని మాదినగూడ, మియాపూర్ నుంచి రోడ్డు మార్గంలో బయలుదేరి, కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో స్వామివారిని దర్శించుకుంటారు. అనంతరం మధ్యాహ్నం 12.00 గంటలకు జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలం చింతలపేట గ్రామానికి చేరుకుని, ఇటీవల హత్యకు గురైన కర్రె సునీత కుటుంబ సభ్యులను పరామర్శించి వారినీ ఓదార్చనున్నారు.తదుపరి మధ్యాహ్న భోజన విరామం అనంతరం రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ఇల్లంతకుంట మండలం రహీంకాన్‌పేట గ్రామానికి బయలుదేరి వెళ్తారు.

## సమస్యల వలయంలో తల్లాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

సీపీఎం నాయకుల ఆందోళన



**నవగీతం,తల్లాడ:** ?తల్లాడ మండలంలో దాదాపు 60 వేల మంది జనాభా ఉన్నప్పటికీ సక్రమమైన వైద్య సేవలు అందక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే తల్లాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని 30 పడకల ఆసుపత్రిగా పెంచి 24 గంటల సేవలు అందుబాటులోకి తీసుకురావాలని సీపీఎం డిమాండ్ చేసింది. సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం తల్లాడ ప్రభుత్వ ఆసుపత్రి, ఆయుష్మాన్ భారత్ కేంద్రాల్లో నిర్వహించిన సర్వే అనంతరం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాదినేని రమేష్ మాట్లాడారు. మండల విస్తీర్ణం దృష్ట్యా మరో కొత్త పిహెచ్‌సిని మంజూరు చేయాలని, ఆయుష్మాన్ భారత్ కేంద్రంలో ఖాళీగా ఉన్న డాక్టర్ పోస్టును వెంటనే భర్తీ చేయాలని కోరారు.?ఆసుపత్రికి ప్రతిరోజూ 100 నుండి 150 మంది రోగులు వస్తున్నప్పటికీ సిబ్బంది కొరత తీవ్రంగా ఉందన్నారు. ఇద్దరు వైద్యులకు గాను ఒక్కరే పనిచేస్తున్నారని, ల్యాబ్ టెక్నీషియన్, ఫార్మసిస్ట్ సహా ఇతర సాంకేతిక, నాన్-సాంకేతిక పోస్టులు ఖాళీగా ఉండటంతో నాణ్యమైన వైద్యం అందక ప్రజలు ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించి ఆర్థికంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే మధుమేహ బాధితులకు అవసరమైన ఇన్సులిన్‌తో పాటు అన్ని రకాల మందుల కొరత తీర్చాలని కోరారు.

ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి అయినాల రామలింగేశ్వరరావు, నాయకులు పులి కృష్ణయ్య, సత్తెనపల్లి నరేష్, రాజబోయిన సైదులు, వంగూరు సుందర్‌రావు, కిషోర్, నరసింహారావు, ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

## కనీస వేతనం రూ.26,000 జీవో కోసం జులై 28న కలెక్టరేట్ వద్ద ధర్నా

ప్రగతిశీల తెలంగాణ హమాలి అండ్ మిల్ వర్కర్స్ యూనియన్




**?నవగీతం,తల్లాడ:** అసంఘటిత రంగంలో పనిచేస్తున్న మిల్లు, హమాలి కార్మికులకు కనీస వేతనం ?26,000 ఉండేలా ప్రభుత్వం తక్షణమే జీవోను విడుదల చేయాలని మరియు వారి కోసం సమగ్ర చట్టంతో పాటు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 28న ఖమ్మం జిల్లా కలెక్టరేట్ ఎదుట భారీ ధర్నా నిర్వహించనున్నట్లు ప్రగతిశీల తెలంగాణ హమాలి అండ్ మిల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి. శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం తల్లాడ మండల కేంద్రంలో ధర్నాను జయప్రదం చేయాలని కోరుతూ విస్తృత ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతున్న నేటి కాలంలో చాలీచాలని వేతనాలతో కార్మికులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వారికి కనీస వేతనాలు అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ?వివిధ రైస్, దాల్, ఆయిల్ మిల్లులు, మార్కెట్ యార్డులు, షాపుల్లో పనిచేస్తున్న గుమస్తాలు, ఆపరేటర్లు, దినసరి కూలీలు, మహిళా కార్మికులకు చట్టబద్ధమైన హక్కులు అమలు కావడం లేదని శ్రీనివాసరావు ఆవేదన వ్యక్తం చేశారు. ఫ్యాక్టరీస్ యాక్ట్ ప్రకారం పి.ఎఫ్., ఇ.ఎస్.ఐ., గ్రాట్యుటీ, ప్రమాద పరిహారం, బోనస్ వంటివి కల్పించడంలో యజమానులు నిర్లక్ష్యం వహిస్తున్నారని, ప్రభుత్వం కూడా వీటి అమలును పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. కార్మికుల హక్కుల సాధన కోసం వివిధ రంగాల్లో పనిచేస్తున్న మిల్లు, హమాలి కార్మికులు అధిక సంఖ్యలో తరలివచ్చి జులై 28 ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టియుసిఐ జిల్లా నాయకుడు షేక్ లాల్మియా, కార్మికులు జి. కృష్ణ, జి. నర్సరావు, డి. నరేష్, శ్రీనివాస్, రాంబాబు, లక్ష్మీనారాయణ, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

నవగీతం
తెలుగు దినపత్రిక
శనివారం
25 జూలై 2026

# “అనుకోలేదు” ఫాదర్ ఎమోషనల్ పాట విడుదల

## గోధూరు గ్రామ ప్రజల చేతుల మీదుగా ఆవిష్కరణ




**నవగీతం,ఇబ్రహీంపట్నం** : ఇబ్రహీంపట్నం మండలం గోధూరు గ్రామంలో “అనుకోలేదు” అనే ఫాదర్ ఎమోషనల్ ఫోక్ పాటను శుక్రవారం గ్రామ ప్రజల చేతుల మీదుగా టీజీర్ ఫోక్ యూట్యూబ్ ఛానల్‌లో విడుదల చేశారు. నవమాసాలు మోసి కని పెంచిన తల్లిదండ్రులను పిల్లలు పెద్దయ్యాక ఎలా విస్మరిస్తున్నారనే హృదయాన్ని కదిలించే సందేశంతో ఈ పాటను రూపొందించారు. సినీ నటుడు గోధూరు మురళి పర్యవేక్షణలో పాట చిత్రీకరణ జరిగింది. పాటకు డాక్టర్ గూరుడు గణేష్ రచన, గానం అందించగా, తేలుకంటి గంగాధర్ స్వరకల్పనతో పాటు దర్శకత్వం వహించారు. తల్లి పాత్రలో సుజాత, తండ్రి పాత్రలో డాక్టర్ గణేశ్, కొడుకుల పాత్రల్లో డాక్టర్ భూరం సంజీవ్, ఎషమేనీ గణేశ్, కోడళ్ల పాత్రల్లో అలేఖ్య, సత్తమ్మ నటించారు. అలాగే గోపు లలిత, భూరం నారాయణ, తాటికొండ పవన్ ముఖ్య పాత్రల్లో కనిపించగా, జూనియర్ నటులు గూరుడు అభిరామ్, గూరుడు శ్రీహాన్స్ తమ నటనతో ఆకట్టుకున్నారు. కెమెరా బాధ్యతలను గని పటేల్ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు మాట్లాడుతూ గోధూరు గ్రామం కళలకు పుట్టినిల్లని, ఇక్కడ ప్రతిభావంతులైన కళాకారులకు కొదవలేదని అన్నారు. భవిష్యత్తులో గోధూరు గ్రామం ఒక చిన్న సినీ పరిశ్రమగా ఎదుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. 60 ఏళ్లు దాటిన తల్లులు కూడా ఈ పాటతో సెలబ్రిటీలుగా మారడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బండి రాజేశ్, ఉపసర్పంచ్ ఓంకార్ లక్ష్మణ్, మాజీ ఎంపీపీ కోటగిరి వెంకటస్వామి, మాజీ సర్పంచులు వేముల లింగారెడ్డి, చెట్ల చంద్రశేఖర్ గౌడ్, సినీ నటులు గోధూరు మురళి, భూరం నారాయణ, తాటికొండ పవన్ తోపాటు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# క్లాస్‌మేట్ కోసం కదిలిన మిత్రబృందం

## ఆర్థిక సాయంతో అండగా నిలిచిన పదో తరగతి పూర్వ విద్యార్థులు



**నవగీతం, కోడిమ్యాల** అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న తమ చిన్ననాటి మిత్రుడికి అండగా నిలిచి, ఆర్థిక సాయం అందిస్తూ స్నేహానికి నిజమైన అర్థాన్ని చాటారు 1990--91 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు.జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలం తిర్మలాపూర్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ చెట్టిపల్లి హరేందర్ కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతూ చికిత్స పొందుతున్నారు. మూడు రోజుల క్రితం వైరల్ ఇన్ఫెక్షన్ కారణంగా కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేరి చికిత్స పొందుతున్నారు. చికిత్స ఖర్చులు అధికంగా ఉండటంతో హరేందర్ కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటోంది.ఈ విషయం తెలుసుకున్న 1990--91 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థులు వెంటనే స్పందించి, తమ వంతుగా విరాళాలు సేకరించి మొత్తం రూ.70,000 సమీకరించారు. శుక్రవారం ఆసుపత్రికి వెళ్లి హరేందర్‌ను పరామర్శించి, ఆ మొత్తాన్ని ఆయన కుటుంబ సభ్యులకు అందజేశారు.ఈ సందర్భంగా క్లాస్‌మేట్స్, ప్యాక్స్ ఛైర్మన్ మేన్నేని రాజనర్సింగరావు రూ.10,000, ఎన్ఆర్ఐ నేరెళ్ల సత్యం రెడ్డి రూ.10,000తో పాటు పలువురు పూర్వ విద్యార్థులు తమ వంతు ఆర్థిక సాయం అందించారు.ఆపదలో మిత్రుడికి అండగా నిలిచిన ఈ పూర్వ విద్యార్థుల బృందాన్ని స్థానికులు అభినందిస్తూ, వారి స్నేహబంధాన్ని ప్రశంసించారు.

# ఎంబీటీకి కాంగ్రెస్ సపోర్ట్



**హైదరాబాద్ :** గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల సమయం దగ్గరపడుతుండటంతో భాగ్యనగర రాజకీయాలు, ముఖ్యంగా పాతబస్తీ వేదికగా సరికొత్త మలుపు తిరుగుతున్నాయి. దశాబ్దాలుగా ఆల్ ఇండియా మజ్లిస్-ఎ-ఇత్తెహాదుల్ ముస్లిమీన్ పార్టీకి తిరుగులేని కోటగా ఉన్న పాతబస్తీలో ఈసారి మునుపెన్నడూ లేని విధంగా ఒక ఆసక్తికరమైన పొలిటికల్ ఈక్వేషన్ తెరపైకి వచ్చింది. ఎంఐఎంను వారి సొంత గడ్డపైనే కట్టడి చేసేందుకు అధికార కాంగ్రెస్ పార్టీ, స్థానిక మజ్లిస్ బచావో తెహ్రీక్ తో చేతులు కలిపి ఉమ్మడి కూటమిగా బరిలోకి దిగే ప్రయత్నాలు చేస్తోంది. చార్మినార్, బహదూర్‌పురా, యాకుత్‌పురా, కార్వాన్ నియోజకవర్గాల పరిధిలోని మున్సిపల్ డివిజన్లు ఎప్పుడూ ఎంఐఎంకు ఏకపక్ష విజయాలను అందిస్తూ వచ్చాయి. అయితే, రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఈసారి పాతబస్తీని నామమాత్రంగా వదిలేయడానికి సిద్ధంగా లేదు. ఎంఐఎం వ్యతిరేక ఓటు బ్యాంకును చీల్చకుండా, పాతబస్తీ గల్లీల్లో బలమైన క్యాడర్ ఉన్న ఎంబీటీ తో అధికారిక లేదా అనధికారిక అవగాహనకు వచ్చేందుకు కాంగ్రెస్ వ్యూహాత్మక అడుగులు వేస్తోంది. బహదూర్‌పురా, యాకుత్‌పురా వంటి డివిజన్లలో ముస్లిం మైనారిటీ ఓటర్ల విభజనను నిరోధించి, ఉమ్మడి అభ్యర్థులను రంగంలోకి దించడం ద్వారా ఎంఐఎంకు చమటలు పట్టించాలని కాంగ్రెస్ స్థానిక నాయకత్వం భావిస్తోంది.పాతబస్తీలో ఎంఐఎంకు సైద్ధాంతికంగా, రాజకీయంగా గట్టి పోటీ ఇచ్చే ఏకైక స్థానిక శక్తి ‘మజ్లిస్ బచావో తెహ్రీక్’ . అమన్ నగర్, యాకుత్‌పురా, చంచల్‌గూడ వంటి పాకెట్స్‌లో ఎంబీటీకి ఇరవై ముప్పై ఏళ్లుగా చెక్కుచెదరని వాలంటీర్ నెట్‌వర్క్ ఉంది. కాంగ్రెస్ పార్టీకి పాతబస్తీలో నాయకత్వం ఉన్నప్పటికీ, గల్లీ స్థాయి బూత్ మేనేజ్‌మెంట్ బలహీనంగా ఉండేది. ఇప్పుడు ఎంబీటీ నెట్‌వర్క్‌ను కాంగ్రెస్ తనతో కలుపుకోవడం ద్వారా, ఎంఐఎం కోటలోని లూప్‌హోల్స్‌ను సులభంగా టార్గెట్ చేయగలుగుతోంది. ముఖ్యంగా మైనారిటీలలోని మతపరమైన సెంటిమెంట్ల కంటే, స్థానిక సమస్యలపై ఎంబీటీ చేసే పోరాటాలు కాంగ్రెస్‌కు క్షేత్రస్థాయిలో మైలేజ్ ఇస్తున్నాయి.ఈసారి పాతబస్తీ ఎన్నికల సరళిలో కనిపిస్తున్న అతిపెద్ద మార్పు.. అక్కడి యువత ఆలోచనా విధానం. దశాబ్దాలుగా కేవలం భావోద్వేగాలు, మతపరమైన సెంటిమెంట్ల ఆధారంగానే పాతబస్తీలో ఓటింగ్ జరుగుతూ వచ్చింది. కానీ, చదువుకున్న నేటి తరం యువత మా గల్లీ పరిస్థితి ఏంటి అని ప్రశ్నిస్తోంది. నిరంతరం పొంగిపొర్లే డ్రైనేజీలు, కలుషిత తాగునీటి సరఫరా, వర్షం వస్తే మునిగిపోయే రోడ్లు, ఉపాధి అవకాశాల లేమి వంటి మౌలిక సమస్యలపై యువతలో తీవ్ర అసంతృప్తి ఉంది. ఐటీ కారిడార్ ఉన్న హైటెక్ సిటీ అభివృద్ధిని, తమ పాతబస్తీ వెనుకబాటుతనాన్ని పోల్చి చూసుకుంటున్న యువత.. ఈసారి మార్పు వైపు మొగ్గు చూపే సంకేతాలు గల్లీల్లో స్పష్టంగా కనిపిస్తున్నాయి. కార్వాన్, యాకుత్‌పురా నియోజకవర్గాల్లోని కొన్ని డివిజన్లలో దశాబ్దాలుగా డ్రైనేజీ వ్యవస్థ ఆధునికీకరణకు నోచుకోలేదు. తాగునీటి పైప్‌లైన్లు, మురుగునీటి లైన్లు కలిసిపోయి కలుషిత నీరు వస్తోందని స్థానికులు ఆగ్రహంతో ఉన్నారు. ఈ పౌర సమస్యలనే కాంగ్రెస్-ఎంబీటీ కూటమి తమ ప్రధాన ఎన్నికల అస్త్రాలుగా మలచుకుంది. అధికారంలో ఉన్నందున తాము గెలిస్తేనే పాతబస్తీ డెవలప్‌మెంట్‌కు నిధులు వస్తాయనే డబుల్ ఇంజన్ కార్డ్‌ను కాంగ్రెస్ బలంగా వాడనుంది.ఈ ఉమ్మడి దాడిని ఎంఐఎం అధినాయకత్వం కూడా తేలిగ్గా తీసుకోవడం లేదు. అసంతృప్తిగా ఉన్న డివిజన్లలో సిట్టింగ్ కార్పొరేటర్లను మార్చడం, యువతకు కొత్తగా టికెట్లు కేటాయించడం ద్వారా యాంటీ-ఇంకంబెన్సీని తగ్గించుకోవాలని అసదుద్దీన్ ఒవైసీ వ్యూహాలు రచిస్తున్నారు. తాము లేకపోతే పాతబస్తీలో ముస్లింల రాజకీయ అస్తిత్వం ప్రమాదంలో పడుతుందనే పాత సెంటిమెంట్‌ను మళ్లీ తెరపైకి తెస్తున్నారు. అయితే, గతంలో లాగా కాకుండా ఈసారి ప్రతి గల్లీలోనూ కాంగ్రెస్-ఎంబీటీ కూటమి గట్టిగా ఎదురుతిరుగుతుండటంతో, ఎంఐఎం తన అభ్యర్థులను గెలిపించుకోవడానికి మునుపటి కంటే ఎక్కువ శ్రమించాల్సి ఉంటుంది. కాంగ్రెస్ పార్టీ అధికార బలం, ఎంబీటీ లోకల్ క్యాడర్, యువతలో ఉన్న సివిక్ అసంతృప్తి.. ఈ మూడు కలిస్తే ఎంఐఎం అజేయ శక్తేమీ కాదని నిరూపించే అవకాశం ఉంది. ఎంఐఎం తన కోటను కాపాడుకుంటుందా లేక కాంగ్రెస్-ఎంబీటీ కూటమి పాతబస్తీ గల్లీల్లో కొత్త చరిత్ర లిఖిస్తుందా అనేది రాబోయే రోజుల్లో జరిగే హైవోల్టేజ్ పోలింగ్ తేల్చనుంది. గ్రేటర్ ఎన్నికలు ఎప్పుడు నిర్వహించినా.. తీవ్ర పోరు ఖాయమని అనుకోవచ్చు.

## ఫీజు బకాయిలు వెంటనే విడుదల చేయాలి

బీజేవైఎం డిమాండ్



**నవగీతం,జగిత్యాల:** బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు ఇట్టేడి రాజు ఆధ్వర్యంలో జగిత్యాల జిల్లా బీజేపీ కార్యాలయంలో “ఫీజు బకాయి -- బీజేపీ లడాయి” పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఇట్టేడి రాజు మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఫీజు బకాయిల కారణంగా విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, స్కాలర్‌షిప్‌ల జాప్యం, ప్రభుత్వ కళాశాలల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. పేద విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాచకొండ యాదగిరి బాబు, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు దురిశెట్టి మమత, సర్ జిల్లా కన్వీనర్ పుప్పాల శ్రీనివాస్, జగిత్యాల టౌన్ అధ్యక్షుడు కొక్కు గంగాధర్, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు నారపాక అశోక్, జిల్లా కార్యదర్శి సుదవేని మహేష్, జిల్లా కార్యాలయ కార్యదర్శి జూంబర్తి దివాకర్, పార్లమెంట్ కో-కన్వీనర్ గుంటూక సదాశివ్, బీజేపీ జగిత్యాల పట్టణ ప్రధాన కార్యదర్శి ఆముద రాజు, బీజేవైఎం నాయకులు పూదరి పవన్, ధీటి వెంకటేష్, పందిరి నాగరాజు, వాకిటి తిరుపతి రెడ్డి, ఐటీ సెల్ కన్వీనర్ పిస్క రాఘవ తదితరులు పాల్గొన్నారు.

## రెడ్డిగూడెంలో ఎన్ఎస్పి కాలువ పనులను పరిశీలించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

?రైతుల సంక్షేమం, అభివృద్ధికి రాజీలేని రీతిలో వేగవంతంగా పనులు పూర్తి చేయాలని అధికారులకు ఆదేశం



**నవగీతం,తల్లాడ:**ఉమ్మడి ఖమ్మం జిల్లా పర్యటనలో భాగంగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క గురువారం సాయంత్రం తల్లాడ మండలం రెడ్డిగూడెం గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న నాగార్జునసాగర్ ప్రాజెక్టు (ఎన్ఎస్పి) కాలువ పనులను క్షేత్రస్థాయిలో ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా పనుల పురోగతిపై అధికారులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కాలువ నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాల విషయంలో ఎలాంటి రాజీ పడకుండా పనులను శరవేగంగా పూర్తి చేయాలని యంత్రాంగాన్ని కఠినంగా ఆదేశించారు. రైతులకు సకాలంలో సాగునీరు అందించడమే ధ్యేయంగా అన్ని ముందస్తు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ?అనంతరం ఆయన మాట్లాడుతూ... రైతుల సంక్షేమం, గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన తాగునీటి వసతులను కల్పించడమే తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు అందించి, ప్రతి ఎకరాకూ సాగునీరు అందించేందుకు తమ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని హామీ ఇచ్చారు. కాగా, ఈ పరిశీలన కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల ఉన్నతాధికారులు, రైతు సోదరులు మరియు రెడ్డిగూడెం గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన్మదిన వేడుకలు



**నవగీతం( రాయికల్ ప్రతినిధి)** తెలంగాణా రాష్ట్ర బి.ఆర్.యస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు 50 వ జన్మదినం శుభ సందర్భంగా రాయికల్ మండల మరియు పట్టణ బి.ఆర్. యస్ పార్టీ ఆధ్వర్యంలో రాయికల్ మండల కేంద్రంలో గల హనుమాన్ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో ఆరోగ్య రిత్య చికిత్స పొందుతున్న పేషేంట్లకు పండ్ల పంపిణి చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాయికల్ మున్సిపల్ ఛైర్మన్ కట్కం రవీందర్, వైస్ ఛైర్మన్ సౌజన్య శ్రీధర్ రెడ్డి, మండల మరియు పట్టణ అధ్యక్షులు బర్కం మల్లేష్,ఎలిగేటి అనిల్,ఆంజనేయ ఆలయ ఛైర్మన్ దాసరి గంగాధర్, కౌన్సిలర్ భూక్య రాకేష్ నాయక్, నాయకులు గోపి రాజారెడ్డి ,కొయ్యాడి మహిపాల్ రెడ్డి,బత్తిని భూమయ్య, నాగరాజు, భూమగౌడ్,గడ్డం గంగారెడ్డి,శ్రీరాముల సత్యనారాయణ, మారంపెల్లి సాయికుమార్, కన్నక మహేందర్, మండ రమేష్,రాజేందర్ గౌడ్, ఆదిరెడ్డి, ప్రతాప్ రెడ్డి, మురళి, విష్ణు, రఘునాథ్, భూక్య లక్ష్మీ, సంతోష్ రావు,కోలరాజు, రాజేశ్వర్ రావు, అనుమల్ల సత్యం, గంగమల్లయ్య, లక్ష్మణ్, చిన్నా,రాజేందర్ రెడ్డి,శ్రీకాంత్,సత్యంగౌడ్, రవి గౌడ్, శ్రీను నాయక్, తిరుపతి, బిక్షపతి, అశోక్,రాంచంద్రం, వినోద్, మహేష్, అజ్జు, మహేందర్ యాదవ్, కోల రవి, నర్సయ్య, తిరుపతి రెడ్డి, కోక్కుల రంజిత్, శ్రీధర్, ఇంద్రాల లక్ష్మణ్, రాజేంధర్, తిరుపతి, సత్యనారాయణ, నవీన్ మరియు భారీ సంఖ్యలో బి.ఆర్.యస్ శ్రేణులు పాల్గొన్నారు.

Printed Published, Owned by PEMBI MAHENDHAR Printed at Saketh Publications, 312. Trinetra Complex, Sangareddy, Telangana 502001.
Published from 11-65/49, PEDDAMMAWADA, MALLAPUR, JAGITIAL, TELANGANA - 505331. PH: 9912484184.
Email : navageetamnews@gmail.com PRGI.NO:TGTEL/26/A2002. EDITOR: PEMBI MAHENDHAR.